
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 13 ఫిబ్రవరి 2025

బుర్రా నుంచి కాపాడు జగనన్నా..!

- ఉలవపాడులో వెలసిన ఫ్లెక్సీ
- కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చేష్టలపై విమర్శలు
- వెంటనే స్థానిక నాయకులతో మాట్లాడిన నేతలు
- ఫ్లెక్సీ తొలగింపు, ఈలోపు సోషల్ మీడియాలో వైరల్



ఉలవపాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద వెలసిన ఫ్లెక్సీ

ఉలవపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : 'కందుకూరు నియోజకవర్గాన్ని, కార్యకర్తలను వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ నుంచి కాపాడు జగనన్నా..'అంటూ ఉలవపాడులో మంగళవారం రాత్రి వెలసిన ఓ ఫ్లెక్సీ కలకలం రేపుతోంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం పక్కనే ఈ ఫ్లెక్సీని కట్టారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు బుర్రా చేష్టలతో ఉరి వేస్తున్నట్లు చిహ్నంగా కొన్ని చిత్రాలు ఆ ఫ్లెక్సీలో ఉన్నాయి. కనిగిరి నియోజకవర్గంలో బంధుప్రీతి, సామాజిక ప్రేమతో తనని ఎమ్మెల్యేగా గెలిపించిన కార్యకర్తలనే కటకటాలపాలు చేసిన బుర్రా కందుకూరులో అదేతరహాలో ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. బంధుప్రీతితో స్థానికంగా తన వాళ్లు చెప్పిన నేతలకే ఇటీవల పార్టీ పదవులు కట్టబెట్టారని, కష్టకాలంలో పార్టీని కాపాడుకుంటూ వచ్చిన కార్యకర్తలకు తీరని అన్యాయం చేశాడంటూ భగ్గుమన్నారు. ఇన్‌చార్జిని మార్చకపోతే నియోజకవర్గంలో పార్టీ బతికి బట్టకట్టడం కష్టమని బుర్రా నుంచి పార్టీని, కార్యాకర్తలను కాపాడాలని ఆ ఫ్లెక్సీలో రాసి ఉంది. కాగా, ఫ్లెక్సీ విషయం తెలుసుకున్న వైసీపీ పెద్దలు కందుకూరు నుంచి హుటాహుటిన ఉలవపాడుకు చేరుకుని స్థానిక వైసీపీ నాయకులతో మాట్లాడి అదేరోజు అర్ధరాత్రి తొలగించారు. ఈలోపే సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఈ వ్యతిరేకత ఎటువైపునకు దారి తీస్తుందోనని నియోజకవర్గ వైసీపీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

చిన్నగొడవే.. హంతకులను చేసింది!

6

గాలిపటాలు ఎగరేసే విషయంలో ఆ యువకుల మధ్య చిన్న గొడవ. మాటామాటా పెరిగి 'చంపేస్తా'నంటూ బెదిరింపుల వరకు వెళ్లింది. అనుకున్నట్టే తమను చంపేస్తాడేమోనన్న భయం వారిని నిద్ర పోనీయలేదు. తాము బతకాలంటే వాడ్ని చంపేయాలన్న భావనతో ఆ ఎనిమిది మంది యువకులు పథకం ప్రకారం అనుకున్నది చేశారు. ఈ నెల 8వ తేదీన నెల్లూరులోని ఉడ్‌హౌస్ సంఘంలో జరిగిన ఓ హత్య కేసులో 8 మంది నిందితు లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులంతా 25 ఏళ్ల వయసు వారే!





బంగారు గరుడ వాహనంపై రంగనాథుడు

వైభవంగా మహామాఘి

జిల్లాలో మహామాఘి (మాఘ పూర్ణిమ), లలితా జయంతి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, గరుడోత్సవాలు జరిగాయి. తల్పగిరి రంగనాథ స్వామి, పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి వైనతేయుడిపై ఊరేగారు. నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. లలిత అమ్మవారు అవతరించిన రోజు కూడా కావడంతో అమ్మవారికి విశేష పూజలు, లలితా సహస్ర నామ పారాయణం, హోమాలు జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

ప్రమాదంలో సోమశిల!

- ఇలాగే వదిలేస్తే తుంగభద్రకు పట్టిన గతే!
- గేట్ల రోప్‌లు దెబ్బతిన్నాయ్!
- తక్షణం పనులు చేసేందుకు ప్రణాళికలు
- సాంకేతిక సలహాదారు కన్నయ్య నాయుడు



సోమశిల డ్యాంపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కన్నయ్య నాయుడు

అనంతసాగరం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'సోమశిల జలాశయంలో క్రస్ట్‌గేట్ల వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయి. డ్యాంకే ప్రమాదం పొంచి ఉంది.' అని రాష్ట్ర జలవనరుల శాఖ సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు తెలిపారు. బుధవారం ఆయన డ్యా సందర్శించారు. క్రస్ట్‌గేట్లు, రోప్‌లు, కంట్రోల్‌రూం, స్టాప్‌లాక్‌గేట్ల పనితీరు, నీటి నిల్వ, విడుదల ప్రక్రియను పరిశీలించారు. అలాగే దీర్ఘకాలిక సమస్యలు అడిగి తెలుసుకొని ఆందోళన వ్యక్తం చెందారు. అనంతరం విలేకరులతో కన్నయ్యనాయుడు మాట్లాడుతూ సోమశిలను నిర్లక్ష్యం వహిస్తే తుంగభద్ర గేటు కొట్టుకుపోయినట్లే ఇక్కడే ప్రమాదం జరిగే సూచనలు ఉన్నయని వాపోయారు. సహజంగా ప్రాజెక్టులకు ఏర్పాటు చేసిన గేట్ల రోప్‌లను 10 నుంచి 15 ఏళ్లకు ఒకసారి మార్చాల్సి ఉండగా ఆ దిశగా ఇక్కడ జరుగలేదని అన్నారు. అందువల్ల సోమశిల గేట్లు దెబ్బతిన్నయన్నారు. ప్రాజెక్టు అభివృద్ధి, పర్యవేక్షణ సరిగ్గా లేనందునే ఈ దుస్థితి నెలకొందని దుయ్యబట్టారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు మార్గనిర్దేశం చేసి ప్రత్యేక ఆర్మీ అండర్ వాటర్ టీంను పిలిపించి నీటిలోపల దెబ్బతిన్న రోప్‌లు, గేట్ల పటిష్ట పనులు త్వరలో చేసేలా ప్రణాళిక చేశామని చెప్పారు. తాను గుర్తించిన సమస్యలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపి సోమశిల పటిష్టతకు చర్యలు చేపడతానని వివరించారు. ఆయన వెంట ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, ఈఈ దశరధరామిరెడ్డి, జేఈలు పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్‌యార్డులో సభావేదిక ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన ఎమ్మెల్యే ఇంటూరి, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

15న సీఎం వస్తున్నారు..

జాగ్రత్త!

- ఏర్పాట్లలో ఏలోటూ రానీయద్దు!
- అందరూ సమష్టిగా పని చేయండి
- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం
- ఎస్పీ, ఎమ్మెల్యేతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

కందుకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : 'స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కందుకురు వస్తున్నారు. ఏర్పాట్లు, భద్రతలో ఏలోటూ రానీయద్దు.' అంటూ కలెక్టర్ ఓ ఆనంద్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి కందుకూరులో సీఎం పర్యటన ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెలిప్యాడ్, బహిరంగ సభ జరిగే వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంతోపాటు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలలో చంద్రబాబు పాల్గొనేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను వారు పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో చేపట్టాల్సిన కట్టుదిట్టమైన ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై ఆయా శాఖలు తీసుకోవాల్సిన బాధ్యతలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెలిప్యాడ్‌కు జరుగుతున్న ఏర్పాట్లను, అనంతరం టిడ్కో గృహ సముదాయాన్ని, వాసవీనగర్‌ను పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాలలో ఒకచోట సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర లక్ష్యం ప్రజలకు అర్థమయ్యేలా పరిశుభ్రత కార్యక్రమం చేపట్టనున్నారు. అనంతరం దూబగుంట సమీపంలో వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి భద్రతా పరంగా తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. చివరగా బహిరంగ సభాస్థలిగా నిర్ణయించిన మార్కెట్ యార్డు ప్రాంతాన్ని వారు పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై వారు సూచనలు చేశారు. సభావేదికకు వచ్చే వారంతా ఇబ్బంది పడకుండా కూర్చునేలా ఏర్పాట్లు చేయటంతోపాటు పార్కింగ్‌కు తీసుకోవాల్సిన చర్యలపై వారు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. వారివెంట కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, పట్టణ పరిపాలన శాఖ కమీషనర్ సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె. అనూష, తహసీల్దారు ఇక్బాల్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తర కాలువ బాగుపడేనా...?

- 'రాళ్లపాడు'తోపాటు చెరువులకు నీరు చేరేనా...
- మట్టి, ముళ్లకంపతో పూడిన కెనాల్
- అభివృద్ధిని మరచిన పాలకులు, అధికారులు

- వివరాలు 6లో

కార్పొరేటర్లకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కరిముల్లాకు కాకుండా స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేసిన 42 మంది వైసీపీ కార్పొరేటర్లకు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కార్తీక్ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పార్టీ విప్ ఉల్లంఘనకు పాల్పడ్డ కార్పొరేటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసీపీ విప్ ఊటుకూరు నాగార్జున, నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ప్రిసైడింగ్ అధికారి కార్పొరేటర్లకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా దీనిపై వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



దివ్యాంగులకు ఇంధన రాయితీ!

- వాహనాలకు రూ.2వేల వరకు సబ్సిడీ
- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు అందించింది. వైకల్యం కలిగి స్వయం ఉపాధి పొందుతున్న వారికి, ప్రైవేటు ఉద్యోగులకు రాయితీపై పెట్రోలు, డీజిల్ అందించనుంది. ఇందుకు సంబంధించి జిల్లాలో వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మూడు చక్రాల మోటారు వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఇంధన భారం లేకుండా 2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాయితీపై పెట్రోలు, డీజిల్ అందించే పథకాన్ని అమలు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని నామమాత్రంగా అమలు చేసింది. దీనికోసం కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు. గతేడాది ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి దివ్యాంగులకు రాయితీపై ఇంధనం ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది.

అర్హులు ఎవరంటే..

ప్రైవేటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి నిమిత్తం మూడు చక్రాల మోటారు కలిగిన వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఈ పథకాన్ని వర్తింప జేస్తారు. వాహనానికి వినియోగించే డీజిల్, పెట్రోలు ఖర్చులో 50 శాతం రాయితీ ఇస్తారు. లబ్ధిదారులు ఇంటి నుంచి పని ప్రదేశానికి వెళ్లే దూరానికి మాత్రమే ఈ రాయితీ వర్తింపజేస్తారు. 2 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన వాహనాలకు నెలకు గరిష్ఠంగా 15లీటర్లు అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వాహనాలకు గరిష్ఠంగా 30 లీటర్ల వరకు లేదా నెలకు రూ.2వేల వరకు లబ్ధి చేకూరుతుంది. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న దివ్యాంగులకు మాత్రమే ఈ రాయితీ ఉంటుంది. ఇంధనం రాయితీకి సంబంధించి, ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులు వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత రాయితీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.

అవసరమైన ధ్రువపత్రాలు

దరఖాస్తుతోపాటు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం మొదటిపేజీ, ఆధార్‌కార్డు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలి.



ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు!



రాయితీ ఇంధనం కోసం అర్హత ఉన్న దివ్యాంగులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికోసం ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులు కార్యాలయంలో సమర్పించాలి. ఆ తర్వాత రాయితీ మొత్తాన్ని లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో చేమ చేస్తాము.

- అత్తర్ మొహమ్మద్ అయూబ్, ఏడీ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ

'చెత్త'శుద్ధి లేదా!?

- కార్యాలయాల ముందే వ్యర్థాలు
- అధికారుల్లారా కళ్లు తెరవరేం!

ఎటు చూసినా చెత్తా చెదారం.. నరికేసిన చెట్ల మొదళ్లు.. భవనాల శిథిలాలు.. మురుగు కంపు.. ఇవండీ మన ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి. వివిధ పనుల కోసం నిత్యం కార్యాలయాలకు వస్తున్న ప్రజలు వీటిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. సాక్షాత్తు జిల్లా ఉన్నతాధికారులు ఉండే ప్రాంతాల్లోనే పరిసరాలు ఇలా ఉంటే ఇక పల్లెసీమల మాటేమిటంటూ నిట్టూరుస్తున్నారు. నెల్లూరు నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోపేరుకుపోయిన చెత్తాచెదారాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది. ఈ ఫొటోలను చూసైనా చెత్తను, వ్యర్థాలను తొలగిస్తారేమో వేచి చూడాలి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)



డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో..



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో..



పాత సామగ్రి మధ్యలో మసకబారిన బాపూజీ, ఎన్టీఆర్ విగ్రహాలు



అంబేడ్కర్ సంక్షేమ కార్యాలయ ప్రాంగణంలో చెత్తతో నిండిపోయిన మురుగు కాలువ



పాత జడ్పీ కార్యాలయంలో ఈ చెట్ల మొదళ్లు ఇంతేనా!?



పాత కార్పొరేషన్ కార్యాలయంలో..



నీటి కొలను ఇలా మారిపోయింది!

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : మాఘ పూర్ణిమ, లలితా జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని ఆలయాల్లో అభిషేకాలు, పూజలు, వ్రతాలు, హోమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

- తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి విశేష ద్రవ్యాలతో తిరుమంజనం, రాత్రి బంగారు గరుడసేవ జరిగాయి.
- రాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, నవావరణ పూజ జరిగాయి. అనంతరం రమాదేవి సమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. ప్రధాన అర్చకుడు రఘురామశర్మ భక్తులతో వ్రతం జరిపించారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూలంగిసేవ, కుంభహారతులు, పల్లకీ, ఊంజల్ సేవ జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. మహాత్మా గాంధీ నగర్ శ్రీకృష్ణమందిరంలో సామూహిక సత్య నారాయణ వ్రతం జరిగింది.
- మాగుంట లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం శ్రీనివాస కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం పూలంగి సేవ, విశేష పూజలు, రాత్రి స్వామివారికి గరుడసేవ జరిగాయి. ఆలయ ఈవో విజయకృష్ణ, శ్రీనివాస్ పర్యవేక్షించారు.
- స్వర్ణాల చెరువు తీరాన ఉన్న స్వర్ణ లింగేశ్వర ఆలయంలో చండీ హోమం జరిగింది.
- నగరం లోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో కొలువైయున్న శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామికి మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి గరుడోత్సవం వైభవంగా జరిగింది. వికాస్ ప్రజాహిత సేవా సమితి వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరిగింది. కల్యాణ వేంకటేశ్వరస్వామికి తొలిసారి గరుడ వాహనంపై నగరోత్సవం నిర్వహించడంపై భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు. ఇంటింటా కర్పూర నీరాజనాలు అర్పించారు. ఇస్కాన్ భక్తుల సంకీర్తనలు, కోలాటాలు, పండరి భజనలు, దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

సత్యనారాయణ వ్రతాలు.. భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి

గరుడోత్సవాలు !



రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరిస్తున్న భక్తులు



మాగుంటలే అవుట్‌లో గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి



బాలాజీనగర్‌లో గరుడ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడి నగరోత్సవం



వంటగ్యాస్ నిత్యావసర వస్తువు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో దీని వినియోగం తప్పనిసరి. గ్యాస్ సిలిండరులో ఉండే ద్రవ రూప ఇంధనం (బ్యూటేన్ పెట్రోలియం)తో అప్రమత్తంగా ఉంటేనే సురక్షితం. ఏ మాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా మూల్యం చెల్లించక తప్పదు. గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి, నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం...

- ఆత్మకూరు, (ఆంధక్రజ్యోతి)

- అప్రమత్తతతో నివారణ సాధ్యం
- జాగ్రత్తలు పాటిస్తే మంచిది

మీ కోసం MEE KOSAM

వంటింట్లో సిలిండరు...

ఆదమరిస్తే డేంజరు!

జాగ్రత్తలు ఇవిగో...

- సిలిండరు కన్నా స్టౌ ఎప్పుడూ ఎత్తులోనే ఉంచాలి.
- సిలిండర్లను క్రమం తప్పకుండా పరిశీలించాలి.
- రెగ్యులేటర్‌ను మరో ట్యూబ్‌తో జత చేయకూడదు.
- వంట పూర్తయ్యాక రెగ్యులేటర్ కట్టేయాలి.
- రెండు రోజులకంటే ఎక్కువ రోజులు సిలిండరును వినియోగించే అవసరం లేకుంటే రెగ్యులేటర్‌ను తొలగించి సేఫ్టీ క్యాప్ పెట్టాలి.
- ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలోనూ సిలిండరు నుంచి రెగ్యులేటర్‌ను వేరు చేసి క్యాప్ పెట్టాలి.
- రెగ్యులేటరు బిగించిన తర్వాత గ్యాస్ సక్రమంగా వస్తుందో, లీకవుతుందో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి.
- మార్కెట్‌లోకి నకిలీ పరికరాలు విచ్చలవిడిగా వస్తున్నాయి. గ్యాస్ కంపెనీలు అందించే పరికరాలనే వినియోగించాలి. అదనంగా పొయ్యి కోసమని, ఎక్కువ మంట కోసమని అధిక మొత్తంగా గ్యాస్ విడుదల చేస్తుందంటూ, గ్యాస్ ఆదా అవుతుందంటూ... మార్కెట్‌లో పరికరాలు విచ్చలవిడిగా వస్తున్నాయి. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

గ్యాస్ లీకవుతుంటే...

గ్యాస్ సిలిండరులో ముఖ్యంగా వాల్వుకు ఏర్పాటు చేసి ఉన్న వాషర్‌తోనే ప్రమాదాలు సంభవిస్తాయి. ఒక్కొక్కసారి వాషర్‌ను చమురు కంపెనీలు సకాలంలో మార్చకపోవడంతో అవి దృఢస్థాయికి చేరుకుంటాయి. దీంతో రెగ్యులేటరును అంటిపెట్టుకుని ఉండేతత్వాన్ని కోల్పోతాయి. ఇటువంటి సమయంలో రెగ్యులేటరును సిలిండరుకు పెట్టి ఆన్ చేయగానే గ్యాస్ లీకవుతుంది. లీకేజిని గమనించిన వెంటనే గ్యాస్ డీలరుకు సమాచారం అందించాలి. డీలరు పంపిన వ్యక్తి వచ్చి సిలిండరును మార్చడమో, వాషర్‌ను సరి చేయడమో చేస్తారు. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నెంబర్లను సంప్రదించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడం అవసరమని నిపుణులు తెలియ చేస్తున్నారు.

కాల పరిమితి ఇలా..

గ్యాస్ సిలిండరు కాలపరిమితిని సూచించే నెంబరు సిలిండరుపై ఉంటుంది. సిలిండరుకు పైభాగంలో ఉండే రింగ్ కమ్ములకు వెనుకవైపున ఏ21, బీ21, సీ21, డీ21 అనే నెంబర్లలో ఏదొకటి ఉంటుంది. ఏ అంటే జనవరి, ఫిబ్రవరి, మార్చి 2025 అని అర్థం. బీ అంటే ఏప్రిల్, మే, జూన్, సీ అంటే జూలై, ఆగస్టు, సెప్టెంబరు, డీ అంటే అక్టోబరు , నవంబరు, డిసెంబరు అని అర్థం. ఈ నెంబర్ల ఆధారంగా సిలిండర్ గడువు తేదీ ఎప్పటివరకు ఉందో తెలుసుకోవచ్చు.

ఏడు నెలలకొకసారి ట్యూబ్ మార్చాలి

ప్రస్తుతం ఆకుపచ్చ రంగు ట్యూబ్‌ను చమురు కంపెనీలు నిషేధించాయి. వీటి స్థానంలో ఎరుపురంగు ట్యూబ్‌ను అందిస్తున్నాయి. ఏడు నెలలకొకసారి సురక్ష ట్యూబ్ మార్చుకోవాలని గ్యాస్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సురక్ష ట్యూబ్‌ను చమురు కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. తక్కువ ధరకు లభిస్తున్నాయంటూ మార్కెట్‌లో లభించే నకిలీ ట్యూబ్‌ను వినియోగిస్తే వాటిలో పగుళ్లు ఏర్పడి గ్యాస్ లీకవడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గమనించాలి.

గమనించాల్సిన అంశాలు

- సిలిండరు నుంచి గ్యాస్ లీకవుతున్నట్లు, గ్యాస్ వాసన వస్తున్నట్లు గమనిస్తే వెంటనే ఎలక్ట్రిక్ స్విచ్‌లు వేయడం ప్రమాదకరం. ఈ సమయంలో నెమ్మదిగా వెళ్లి సిలిండరుపై ఉన్న రెగ్యులేటర్‌ను తొలగించి సిలిండరును ఇంట్లో నుంచి బయటకు తీసుకురావాలి.
- వంటింట్లో కిరోసిన్ నిల్వ చేయడం సర్వసాధారణం. ఇది ప్రమాదానికి కారణం అవుతుంది. కిరోసిన్ నుంచి విడుదలయ్యే వాయువులు ఒక్కొక్కసారి చాలా తీవ్రతరంగా మారి విస్ఫోటనాన్ని సృష్టించిన ఘటనలు ఉన్నాయి.
- నాణ్యమైన స్టౌ వాడాలి. ఇందుకు పేరున్న కంపెనీల స్టౌలే ఉత్తమం. వీటి వాడకం వలన గ్యాస్ ప్రమాదాల నివారణతో పాటు గ్యాస్ వృథాను అరికట్టవచ్చు.
- ఎలక్ట్రానిక్ వస్తువులు వంటివి వంటగదిలో ఉండకూడదు.
- గ్యాస్ లీకవుతున్నట్లు గమనిస్తే వెంటనే తమ పరిధిలోని డీలరు ల్యాండ్ నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలి. వెంటనే గ్యాస్ సర్వీసు బాయ్‌ను పంపాల్సిన బాధ్యత వారిపై ఉంది.

ప్రతి 3వ శనివారం

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'

- దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



?: 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో ఏం చేస్తారు.

!: ఆలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ కార్యక్రమా నికి ప్రభుత్వం నన్ను నోడల్ అధికారిగా నియమించింది.

?: దేవదాయ భూముల సమస్య పరిష్కారం మాటేమిటి.

!: రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ శాఖ భూముల సమస్యపై రెవెన్యూ శాఖకు 763 అర్జీలు వచ్చాయి. సుమారు 8వేల ఎకరాల దేవదాయ శాఖ భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో (ఆన్‌లైన్) నమోదు చేయాల్సి ఉంది.

?: జిల్లాలో ఆలయాల జీర్ణోద్ధరణ ఎప్పుడు

!: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో 18 పురాతన దేవాలయాల పునర్నిర్మాణానికి టెండరు ప్రక్రియ జరుగుతోంది.

?: పునర్నిర్మాణానికి ఎంత ఖర్చు చేస్తారు.

!: నెల్లూరు మూలాపేటలోని వేణుగోపాలస్వామి, సోమశిల సోమేశ్వరా లయంతోపాటు కావలి, ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాల్లోని పురాతన ఆలయాలు పునర్నిర్మాణానికి రూ.60కోట్లు మంజూరయ్యాయి.

?: శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ఎలా ఉన్నాయి.

!: జిల్లాలో ప్రముఖ ఆలయాల్లో శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయానికి నన్ను ఫెస్టివల్ అధికారిగా ప్రభు త్వం నియమించింది. గండవరం ఉదయకాళేశ్వరాలయం, కృష్ణాపట్నం సిద్ధేశ్వరాలయం, కాటేపల్లి శివాలయంలతోపాటు అన్ని శైవ క్షేత్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నాము.

- 'రాళ్లపాడు'తోపాటు చెరువులకు నీరు చేరేనా!?
- మట్టి, ముళ్లకంపతో పూడిన కెనాల్
- అభివృద్ధిని మరచిన పాలకులు, అధికారులు

ఉత్తర కాలువ

బాగుపడేనా...?

కొండాపురం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): సోమశిల ఉత్తర కాలువ ద్వారా మండలంలోని పలు గ్రామాల చెరువులకు నీరు అందించేందుకు అధికారులు సుమారు 40 ఏళ్లక్రితం నిర్ణయం తీసుకున్నారు. దీంతో అప్పటి ప్రభుత్వం కాలువ తవ్వేందుకు నిధులు కేటాయించింది. కాలువ నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపాయి. దీంతో కొన్నిరోజులు పనులు ఆగిపోయాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయగా, 2017లో మండలానికి సోమశిల నీరు చేరింది. అప్పట్లో కాలువ తవ్వకంలో నాణ్యతా లోపంతో నీరు సక్రమంగా చెరువులకు చేరలేదని మండల రైతులు ఆరోపిస్తున్నారు.



కంపచెట్లతో కుంచించుకుపోయిన కాలువ

పరిహారమేదీ ?

సోమశిల నుంచి నీరు సుమారు 110 కిలోమీటర్ల దూరం ప్రవహించి రాళ్లపాడు రిజర్వాయరుకు చేరాలి. భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందించడం లోనూ ఇటు అధికారులు, అటు పాలకులు నిర్లక్ష్యం చూపారని రైతులు అంటున్నారు. తమకు పరిహారం అందలేదని చింతలదీవి గ్రామరైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ గ్రామం వద్ద సుమారు 600 మీటర్ల దూరం కాలువ తవ్వకం ఆగిపోయింది. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతులతో మాట్లాడటంతో కాలువ తవ్వకానికి మార్గం సుగమమైంది. 2017-18లో కాలువ ద్వారా నీరు రాళ్లపాడుతోపాటు సత్యవోలు, కొమ్మి, సాయిపేట, రేణమాల చెరువులకు చేరగా, రైతులు పంటలు పండించుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కాలువను తవ్వి వదలేయడంతో వర్షాలకు, నీటి ప్రవాహానికి పూడిపోయింది. కంపచెట్లు కూడా పెరిగాయి. పూడికతీయడంతోపాటు కాలువను అభివృద్ధి చేసి మండలానికి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు. అలాగే భూమి కోల్పోయిన రైతులకు పరిహారం వెంటనే ఇవ్వాలని వారు కోరుతున్నారు.



జలాశయం ఎగువన అలివి వల లాగుతున్న జాలర్లు (ఫైల్)

నిషేధిత అలివి వలలతో వేట

- సోమశిలలో తగ్గుతున్న మత్స్యసంపద
- ఇబ్బందులు పడుతున్న జాలర్లు

అనంతసాగరం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో నిషేధిత అలివి వలలతో అక్రమంగా వేట సాగిస్తుండడంతో మత్స్యసంపద కరువై జాలర్లు ఇబ్బందులు పడుతున్నారు. సోమశిల ప్రాజెక్టులో అలివి వలలతో వేట సాగించడం నిషేధం. కానీ కొందరు ముఠా నాయకులు, వ్యాపారులు అలివి వలలతో జాలర్లతో వేట సాగించి సంపదను కొల్లగొడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానిక జాలర్లు విమర్శిస్తున్నారు. ప్రాజెక్టు ఎగువన ఉన్న ప్రాంత మంతా కడప జిల్లా సరిహద్దు కావడంతో ఎగువకు వెళ్లి తనిఖీలు చేయక పోవడంతో విచ్చలవిడిగా అలివి వలలతో వేట సాగిస్తున్నట్లు సమాచారం. కాగా, అలివి వలలతో వేట సాగించడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద కరువై జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ఇకనైనా సోమశిల జలాశయంలో అలివి వలలతో వేట సాగించకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్యకారులు జిల్లా అధికారులను కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఏడీ సుమతి, పక్కన శాస్త్రవేత్తలు

రేపు కిసాన్ మేళా

- వేదిక నెల్లూరు ఏఆర్ఎస్
- ఆధునిక సాంకేతికతపై సదస్సు, ప్రదర్శనలు
- తిరుపతి ఆర్ఏఆర్ఎస్ ఏడీ సుమతి

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానం(ఏఆర్ఎస్)లో శుక్రవారం కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) సహ సంచాలకులు డాక్టర్ వీ సుమతి పేర్కొన్నారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత - లాభ సాటి వ్యవసాయం అనే ప్రధానాంశంతో రైతు లకు వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా ఈ మేళా జరుగుతుందని, 60 స్టాళ్లతో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వరి, అపరాలు, వాణిజ్య, ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తలు వివరిస్తారని తెలిపారు. ఆక్వా కల్చర్‌లో నూతన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తారన్నారు. శాస్త్రవేత్తలు, రైతులతో చర్చా కార్యక్రమం కూడా ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యూ వినీత, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లలితా శివజ్యోతి పాల్గొన్నారు.

పథకం ప్రకారమే హత్య

- కదలికలపై నిఘా
- ఉడ్‌హౌస్‌సంఘం మర్డర్ కేసులో 8 మంది అరెస్టు
- నిందితులందరూ 25 ఏళ్లలోపు వారే!

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వారందరూ పాతికేళ్లలోపు యువకులే. పెద్దగా నేర ప్రవృత్తి లేదు. ఏటి పండుగలో ఒకరితో మొదలైన చిన్న గొడవ ఒక ప్రాణం తీసే వరకు వెళ్లింది. నెల్లూరులోని ఉడ్‌హౌస్ సంఘంలో ఈ నెల 8వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసును నవాబుపేట పోలీ సులు ఛేదించారు. నిందితుల వివరాలను నగర డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సింధుప్రియ బుధవారం మీడియాకు వెల్లడించారు.

ఉడ్‌హౌస్ సంఘానికి చెందిన కోడూరు కల్యాణ్ ఉరాఫ్ చిన్నా(25) పెయింట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనిపై నవా బు పేట పోలీసు స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉంది. 8వ తేదీ రాత్రి ఉడ్‌హౌస్ సంఘం వెనుక సిమెం ట్ రోడ్డులో స్నేహితులతో కలిసి మద్యం సేవి స్తుండగా రెండు ద్విచక్ర వాహనాల్లో గుర్తు తెలియని ఐదుగురు వచ్చి చిన్నాపై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలతో రక్తపు మడుగులో ఉన్న చిన్నాను స్నేహి తులు జీజీహెచ్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. చిన్నా తల్లి వేళాంగణి ఫిర్యాదుతో నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషా హత్య కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ సింధుప్రియ నేతృత్వంలో తన సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేట్టారు. నేరస్థలిలో లభ్యమైన ఆధారాలు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు జాకీర్ హుస్సేన్ నగర్‌కు చెందిన దోనిపర్తి అజయ్‌కుమార్, మన్సూర్‌నగర్‌కు చెందిన ముర గన్ అజిత్ అలియాస్ కుల్లా, భగత్‌సింగ్ కాలనీకి చెందిన శివకుమార్, కుసుమ హరిజన వాడకు చెందిన ఏ ఉదయ్ కిరణ్, సత్యనారాయణపురానికి చెందిన వీ సురేంద్ర అలియాస్ సూరి అలియాస్ రాక్, స్టోన్‌హౌస్‌పేటకు చెందిన కే పవన్‌కుమార్, శెట్టిగుంట రోడ్డుకు చెందిన కే రమేష్, కిసాన్ నగర్‌కు చెందిన జీ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. వారిని బుధవారం అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

ఏటి పండుగలో గొడవ

గత నెల 16న పెన్నానది ఒడ్డున జరిగిన ఏటి పండగలో గాలిపటాలు ఎగురవేస్తుండగా చిన్నా, అజయ్ మధ్య గొడవ జరిగింది. అది ముదిరి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో అజయ్‌ను చంపుతానని చిన్నా తరచూ బెదిరించేవాడు. చంపేస్తాడన్న భయంతో అజయ్ తన స్నేహితులు అజిత్, శివకుమార్, ఉదయ్‌కిరణ్, సురేంద్ర, పవన్‌కుమార్, రమేష్, మనోజ్ కుమార్‌తో కలిసి చిన్నాను హత్య చేయాలని నిర్ణయించారు. పవన్ కుమార్, రమేష్, మనోజ్‌కుమార్‌లు చిన్నా కదలికలపై నిఘా ఉంచారు. ఈ నెల 8వ తేదీ రాత్రి చిన్నా తన స్నేహితులతో ఉడ్‌హౌస్ సంఘంలో మద్యం సేవిస్తున్న విషయాన్ని తెలుసుకున్నారు. దీంతో అజయ్ తన స్నేహితులు అజిత్, శివకుమార్, ఉదయ్‌కిరణ్, సురేంద్రతో అక్కడికి చేరుకుని చిన్నాపై కత్తులతో దాడి చేసి పరారయ్యారు. ఈ నేరాన్ని నిందితులు అంగీకరించిన ట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తులు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై త్వరలోనే రౌడీషీట్లు తెరుస్తామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, ఎస్ఐలు రహిమాన్, శీనయ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నిందితుల వివరాలు తెలుపుతున్న నగర డీఎస్పీ సింధుప్రియ

న్యూస్ బాక్స్

ఓడీఎఫ్‌గా బోగోలు, జువ్వలదిన్నె

బిట్రగుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బోగోలు, జువ్వలదిన్నె పంచాయతీలను ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ)గా ఉన్నతాధికారు ఎంపిక చేసినట్లు ప్రత్యేక అధికారి, అల్లూరు ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు.బేతనీపేట, జువ్వలదిన్నె, బోగోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బుధవారం అల్లూరు ఈవోపీఆర్డీ పెంచలవీరేంద్ర, బోగోలు పంచాయతీ కార్యదర్శి జహీర్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన మంచిదికాదని, వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సీ పెంచలయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు నలుగురు గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ 3, 6వ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 133 మంది విద్యార్థులకు 129 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఎన్‌టీఆర్ నగర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని బాలాజీనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మెక్లీన్స్‌రోడ్డుకు చెందిన షేక్ అజీజ్, నెల్లూరు రూరల్ మండలం మాదరాజుగూడూరుకు చెందిన ఎస్ సునీల్ గంజాయికి బానిసలుగా మారారు. అనంతరం గంజాయి విక్రయాలకు పాల్పడుతూ ఆదాయం పొందుతున్నారు. ఎన్‌టీఆర్ నగర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ కే సాంబశివ రావు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో నిందితులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కేజీబీవీలో ప్రవేశించిన నిందితుడి అరెస్టు

కావలి రూరల్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లోకి ఈనెల 8న అర్థరాత్రి గోడ దూకి ప్రవేశించిన నిందితుడిని బుధవారం పట్టణంలోని పెద్దపవని రోడ్డులో రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. విద్యాలయంలోకి ప్రవేశించటంతోపాటు విద్యార్థిని కొట్టిన కేసులో నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ ఆదేశించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పెళ్లి పేరుతో మోసం.. యువకుడిపై కేసు

వెంకటాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లైంగిక వాంఛ తీర్చుకుని మోసం చేసిన యువకుడిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కసుమూరు దళితవాడకు చెందిన కోల మస్తాన్‌బాబు ఓ 20 ఏళ్ల యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తన మాయమాటలతో ఆ యువతి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వెళ్లి పలుదఫాలు లైంగిక వాంఛ తీర్చుకున్నాడు. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలిసి పెళ్లి చేసుకోవాలని ఆ యువకుడిని కోరగా అందుకు అంగీకరించలేదు. దీంతో మోసపోయానని తెలుసుకున్న ఆ యువతి బుధవారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	114
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8190
వెండి కిలో ధర	రూ. 97,100
వెండి ఒక గ్రాము	రూ. 100.10

ప్రసన్న వేంకటేశ్వరుడికి వైభవంగా గరుడసేవ



బోగోలు మండలం కొండబిట్ర గుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామికి మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి వైభవంగా గరుడసేవ నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఐ బచ్చు కృష్ణకుమార్-సంధ్య దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహ రించారు. గజమాలధారుడైన ప్రసన్న వేంకటేశ్వరుడు గరుడ వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఊరేగుతుండగా, భక్తుల గోవిందనామ స్మరణతో బిల కూట క్షేత్రం మారుమోగింది. కార్యక్ర మంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి మాజీ చైర్మన్ శ్రీరామ్ మా ల్యాద్రి, గోపీకృష్ణ, సాయిసేవకులు తదితరులు పాల్గొన్నారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025 - 26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ఇంగ్లీషు మీడియం, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ఐఐటీ, నీట్ అకాడమీలో ప్రవేశాలకు బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ పద్మావతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెద్ద పవని, ముత్తుకూరు, కండలేరు, బుచ్చి, కోడూరు, సంగం, ఆదూరుపల్లి, బోగోలు.. తదితర చోట్ల అంబేడ్కర్ గురుకులాల సహాయ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. అయా గురుకులాల్లో ఒక్కొక్క గురుకులానికి 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరానికి ఆదురుపల్లి, బోగోలు మినహాయించి మిగిలిన ఆరు గురుకులాల్లో 80 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్ష ఏప్రిల్ 6న జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష కూడా ఏప్రిల్ 6న, ఐఐటీ, నీట్ అకాడమీల ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20వతేదీ నిర్వహిస్తారని తెలిపారు.

సర్పాల సయ్యాట



చరిత్రలో అద్భుతమైన నాగిని నృత్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాంటి దృశ్యమే పొదలకూరు శ్రామికనగర్ సమీపంలో బుధవారం రెండు నాగులు సయ్యాటలాడుతూ కనిపించాయి. ఆ దారిన వెళుతునప్న ఓ యువకుడు తన ఫోన్‌లో కొన్ని సెకన్లపాటు ఈ సయ్యాటను చిత్రీకరించాడు.

- పొదలకూరు(ఆంధ్రజ్యోతి)

ప్రాక్టికల్స్‌కు 197 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షలకు మంగళవారం 197 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం జరిగిన పరీక్షలకు 3,953 మందికి 3,842 మంది హాజరుకాగా 111 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం సెషన్‌లో 3,709 మందికి 3,623 మంది హాజరుకాగా 86 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి, కిషోర్స్ రత్నం, ఓవెల్, కృష్ణచైతన్య, డీకేడబ్ల్యూ కళాశాలల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డీవీఈవో, డీఈసీ సభ్యులు, ఫ్లైయింగ్‌స్క్వాడ్ పలు కేంద్రాలను పరిశీలించాయి.

రేపు టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడి యంలో సీనియర్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్న ట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ యుగంధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఆ రోజు ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు చిత్తూరు జిల్లా చంద్రగిరిలో ఈనెల 21 నుంచి జరిగే 12వ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రపోటీల్లో సత్తా చాటిన వారిని తిరుపతి జిల్లాలో ఏప్రిల్, మే నెలల్లో జరిగే ప్రప్రథమ టెన్నిస్‌బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలకు ఆక్షన్ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. అలాగే ఏప్రిల్ 11 నుంచి 13 వరకు నాగ్‌పూర్‌లో జరిగే సీనియర్ జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు అర్హత సాధిస్తార న్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సోమశిలలో 63.998 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 1,013 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 63.998 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

లాలపోయాలంటే నీళ్లు కొనాల్సిందే !



- జీజీహెచ్ ప్రసూతి విభాగంలో పనిచేయని సోలార్ హీటర్లు
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి
- పురిటి బిడ్డలకు వేడినీళ్లు కరువు
- విధిలేక బయట కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిండు గర్భవతి గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. దీని వల్ల శరీరానికి హాయిగా ఉండటమేకాక బాక్టీరియా నశించి ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఇదేవిధంగా కాన్పు అయిన వెంటనే పురిటి బిడ్డలను శుభ్రం చేయాలన్నా, తదుపరి రెండు పూటలా తుడవాలన్నా గోరువెచ్చని నీరు కావాలి. అయితే నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో వేడినీరు అందుబాటులో ఉండటం లేదు. కావాల్సిన వారు బయట కొనుక్కోవాల్సిన పరిస్థితి.

ప్రసూతి విభాగంలో అవసరాల కోసం కొన్నేళ్ల క్రితం 12 సోలార్ హీటర్లు ఏర్పాటు చేశారు. అవి రెండేళ్లుగా పనిచేయడం లేదు. కేవలం రూ. 10వేల నుంచి 20 వేలు ఖర్చు చేస్తే సోలార్ హీటర్లు అందుబాటులోకి వస్తాయని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నా పై అధికారుల నుంచి స్పందన కరువైంది. పురిటి బిడ్డలకు వేడినీరు అవసరమని వైద్యులు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా వారి గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీని వల్ల కాన్పు కోసం వచ్చిన నిండు గర్భిణులు, కాన్పు అయిన బాలింతలు, పురిటి బిడ్డల కుటుంబ సభ్యులు నానా కష్టాలు పడుతున్నారు. బయటి దుకాణాల్లో వేడి నీటిని కొనుగోలు చేస్తున్నారు. సగటున రోజుకు రూ.25 నుంచి రూ.50 వరకు వేడి నీటి కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఆసుపత్రికి వచ్చే వారిలో ఎక్కువ శాతం పేదలే కావడంతో వేడి నీళ్లకు కూడా డబ్బు ఖర్చు చేయాల్సి రావడం వారికి అదనపు భారం అవుతోంది.



పనిచేయని సోలార్ హీటర్లు

త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం



ప్రసూతి విభాగంలో గతంలో 12 సోలార్ హీటర్ల ద్వారా వేడినీరు వచ్చేది. ఆ తర్వాత ఒక్కొక్కటిగా మొరాయించాయి. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇటీవల వాటిని పరిశీలించా ము. మరమ్మతులు చేయిం చి కొన్నింటినైనా అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

- శ్రీనివాసులు, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్

జగనన్న లేఅవుట్లపై విజిలెన్సు విచారణ

మనుబోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరు, కాగితాలపూరు. ముద్దమూడి, కొలనుకుదురు గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లపై విజిలెన్సు అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్సు సీఐ నరసింహారావు మాట్లాడుతూ అసైన్‌మెంట్ భూముల్లో లేఅవుట్లు మాత్రమే పరిశీలించామన్నారు. నాలుగు రోజుల క్రితం అక్కంపేట లేఅవుట్‌ను పరిశీలించామన్నారు. లేఅవుట్లు వేసిన సమయంలో భూమి విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎంత ఉంది, ప్రభుత్వం నుంచి ఎంత నష్టపరిహారం ఇచ్చారు, లేఅవుట్‌లో ఎలాంటి పనులు చేయాల్సి ఉంది. ఎంతమేర చేసి ఉన్నారన్న విషయాలను సేకరించి నమోదు చేశామన్నారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్సు హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, ఆయా గ్రామాల వీఆర్‌వోలు పాల్గొన్నారు.



పిడూరు జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న విజిలెన్సు అధికారులు

కారు,లారీ ఢీ : తప్పిన పెను ప్రమాదం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కారు- లారీ ఢీకొన్న సంఘటన బుధవారం భోగ్యం వారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఉప్పువాగు వంతెనపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా పామూరు నుంచి దుత్తలూరు వైపు వెళ్తున్న లారీ వంతెనపై ఉన్న గుంతలను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. దీంతో కారు ముందుభాగం కొంతమేర దెబ్బతిన్నప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన మర మ్మతు పనులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



వంతెనపై ఢీకొన్న వాహనాలు

బెంచీ విషయమై విద్యార్థుల ఘర్షణ

- బ్లేడుతో దాడి - ముగ్గురికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బెంచీపై కూర్చొనే విషయమై విద్యార్థుల మధ్య చోటుచేసుకొన్న ఘర్షణలో ఓ విద్యార్థి ముగ్గురు విద్యార్థులపై బ్లేడుతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాఠశాలలో పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు జరుగుతుండటంతో బెంచీల కొరత ఏర్పడింది. దీంతో 9వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు మరోచోట నుంచి బెంచీని తీసుకొచ్చి తరగతి గదిలో వేసుకుని కూర్చున్నారు. ఈ తరుణంలో ఓ విద్యార్థి అక్కడికి చేరుకొని అది తాను కూర్చునే బెంచీ అని వారితో ఘర్షణకు దిగి తన వద్దనున్న బ్లేడుతో ఆ ముగ్గురిపై విచక్షణారహితంగా దాడిచేశాడు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ఉపాధ్యా యులు గాయపడిన విద్యార్థులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం హెచ్‌ఎం బాలకేశవులు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పాఠశాలకు చేరుకుని వివరాలు సేకరించి విద్యార్థులను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విద్యార్థి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మా పిల్లలను పాఠశాలకు పంపం

పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, హెచ్‌ఎం బాలకేశవులు పీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. దాడి చేసిన విద్యార్థి పాఠశాలకు వస్తే తమ పిల్లలను పాఠశాలకు పంపమని, టీసీలు తీసుకుని వెళ్లిపోతామని తల్లిదండ్రులు తెగేసి చెప్పారు. దీంతో స్పందించిన వారు విద్యార్థి తల్లిదండ్రులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


సాయిపేట చెరువులో కలప వేలం

కొండాపురం, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): సాయిపేట గ్రామ చెరువులోని కలప వేలాన్ని బుధవారం ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్ నిర్వహించారు. సచివాలయం వద్ద జరిగిన ఈ వేలంలో పలు గ్రామాల ప్రజలు ధరావత్తు రూ.10 వేలు చెల్లించి పాల్గొన్నారు. ప్రారంభధర రూ.లక్ష నిర్ణయించగా సాయిపేటకి చెందిన ఉన్నం నవీన్ రూ.4.66 లక్షలకు వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గంటా లక్ష్మీ నరసింహులు, నాయకులు ప్రవీణ్, వల్లూరు వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముందు లాక్.. వెనుక ఓపెన్ !!

- ఇదీ జీజీహెచ్, వైద్య కళాశాల క్యాంటీన్ పరిస్థితి
- నాలుగేళ్లుగా నిరుపయోగం
- రూ. 24.40 లక్షల నష్టం
- చీకటి కార్యకలాపాలకు నిలయం!

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రికి అనుబంధంగా అదే ప్రాంగణంలో ఉన్న క్యాంటీన్ చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. వైద్య కళాశాల, ఆసుపత్రికి వచ్చే వారి కోసం ఇక్కడ భారీ క్యాంటీన్‌ను 2014లో ఏర్పాటు చేశారు. గతంలో కళకళలాడిన ఈ క్యాంటీన్ ఇప్పుడు కళావిహీనంగా తయారైంది. చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. భవనం ముందు వైపు తాళం బుర్ర వేసి ఉన్నా వెనుక వైపు తెరచి ఉంది. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు వెనుక ద్వారం గుండా లోపలికి ప్రవేశిస్తున్నారు. భవనం లోపల ఫ్రిజ్‌లు, గ్యాస్ సిలిండర్, ఖరీదైన కుర్చీలు ఉన్నాయి. వీటికి రక్షణ కరువైంది.







పిచ్చిచెట్ల మధ్య క్యాంటీన్ భవనం

ముందు వైపు ద్వారానికి వేసిన తాళం

క్యాంటీన్ వెనుకవైపు తెరిచి ఉన్న తలుపు

బయటికెళ్లక తప్పదు

వైద్య కళాశాలలో 700 మందికిపైగా విద్యార్థులు, పీజీ మెడికోలు ఉన్నారు. జీజీహెచ్‌కు ప్రతి రోజూ 1200 మందికిపైగా ఔట్ పేషెంట్లు వస్తుంటారు. ఇన్‌పేషెంట్లుగా 450 మంది వరకు ఉంటారు. అయినా వైద్య కళాశాల, ఆసుపత్రి ప్రాంగణంలో క్యాంటీన్ లేకపోవటంతో కాఫీ, టీ, ఆహారం కోసం బయట రోడ్డుకు అవతల ఉన్న క్యాంటీన్లకు వెళుతున్నారు.

4 ఏళ్లలో రూ.24.40 లక్షల నష్టం

ఇక్కడ నెలవారీ క్యాంటీన్ బాడుగ రూ.55 వేలు. నాలుగేళ్లగా ఈ క్యాంటీన్ మూతపడటంతో రూ.24.40 లక్షల ఆదాయాన్ని కళాశాల కోల్పోయింది. 2018 - 20 సంవత్సరాలలో క్యాంటీన్‌ను బాడుగకు తీసుకున్న వారు అద్దె సరిగా చెల్లించలేదు. బకాయిలు వసూలు చేయడంలో అధికారులు వైఫల్యం చెందారు. ప్రస్తుతం క్యాంటీన్‌ను అద్దెకు తీసుకునేందుకు ఎవరూ రాలేదంటున్న అధికారులు, అసలు క్యాంటీన్ నిర్వహణకు టెండర్లు పిలిచా రా.. అంటే అదీ లేదు. అద్దె ఎక్కువని చెబుతున్న అధికారులు డీఎంఈతో మాట్లాడి అద్దె తగ్గించేందుకు అనుమతులు కూడా తీసుకోలేదు. ఇలా యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన క్యాంటీన్ భవనం నిరుపయోగంగా మారింది.

అమనుమతులు పొంది అద్దెకు ఇచ్చేలా కృషి చేస్తాం



క్యాంటీన్‌ను అద్దెకు ఇచ్చేలా కృషి చేస్తాము. అద్దె ఎక్కువగా ఉందన్న సమస్యను డీఎంఈ దృష్టికి తీసుకువెళతాం. అద్దె తగ్గించి బాడుగకు ఇచ్చేలా ప్రయత్నిస్తాం. కలెక్టర్ అనుమతితో టెండర్లు పిలుస్తాము. క్యాంటీన్ తెరుచుకుంటే కళాశాలకు ఆదాయం కూడా వస్తుంది. క్యాంటీన్ భవనం చుట్టూ ఉన్న పిచ్చి చెట్లను వీలైనంత త్వరగా తొలగిస్తాము.

- డాక్టర్ రాజమన్నార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

కేంద్ర బడ్జెట్‌లో కార్మిక, ఉపాధి కూలీలకు అన్యాయం

- 20న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన
- సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ విమర్శించారు. బుధ వారం నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో 30 కోట్ల మంది వ్యవసాయ కూలీలు ఉండగా వారికి బడ్జెట్‌లో ఎలాంటి ప్రయోజనాలు ప్రకటించలేదని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి కూడా అరకొరగానే కేటాయింపులు జరిగాయన్నారు. వైద్య రంగానికి 6 శాతం, విద్యకు 3 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు పడలేదన్నారు. దీనికి నిరసనగా శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం, 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

పూనూరు రవికుమార్‌రెడ్డికి ఘన నివాళులు



పూనూరు రవికుమార్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి) జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి పూనూరు రవికుమార్‌రెడ్డి పెద్దకర్మను పురస్కరించుకుని బుధవారం కావలి పాతూరులోని ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తదితరులు ఘననివాళులర్పించారు. రవికుమార్ చిత్రపటం వద్ద పూలతో శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రవికుమార్ మృతి బాధాకరమని, టీడీపీ తీరని లోటని ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు మన్విత రెడ్డి, పాయిప్రసాద్‌రెడ్డి, పూనూరు సౌమ్య, టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ పూనూరు వెంకారెడ్డి, పూనూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పూనూరు మాధవిరెడ్డి, మురళీరెడ్డిలను ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతి తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్ కిరణ్, తలమంచిరవి, తిరివీధి ప్రసాద్, చవల రామకృష్ణ తదితరులు పాల్గొని రవికుమార్‌కు నివాళులర్పించారు.

● అనాథ బాలలకు దేవుడు శరత్‌బాపూజీ

అల్లూరు : అనాథ బాలలకు చైల్డ్ ఆశ్రమ చైర్మన్ రామచంద్ర శరత్‌బాపూజీ దేవుడని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నార్తుఆములూరులోని చైల్డ్ ఆశ్రమంలో బోగోలుకి చెందిన అమరా బచ్చు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బాలల కోసం నిర్మించిన పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆశ్రమంలోని అన్ని వసతులను, భవనాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వందలాదిమంది బాలలను అక్కున చేర్చుకున్న రామచంద్ర శరత్‌బాబు లాంటివారు ఉండడం దేశం గర్వించదగిన విషయమన్నారు. తదుపరి అమరా బచ్చు ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణకుమార్-సంధ్య దంపతులు, ట్రస్టీ ఎస్. ఆనంద్ సాగర్ మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బండి శ్రీనివాసులురెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్, దాసరి కరుణాకర్, పెయ్యల భాస్కర్, గుంజి మల్లికార్జున పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసిన ఎమ్మెల్యే కాకర్ల

● అధికారులు లేకపోవడంతో అసహనం



అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో తహసీల్దార్, డీటీ, ఆర్ఐ లేకపోగా, సీనియర్ అసిస్టెంటు, కొందరు వీఆర్వోలు మాత్రమే ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. అధికారులు అందుబాటులో లేకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని సిబ్బందిని ప్రశ్నించారు. వీఆర్వోల కొరత, కార్యాలయానికి ప్రహరీ గోడ, టాయిలెట్ల సమస్య ఉందని వాటిని పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల అర్జీలను పరిశీలించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ పోలినేని చంద్రబాబునాయుడు, మాజీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు, నాయకులు జాగర్లమూడి శ్రీను, దాసరి అశోక్, టీ.అనూష, నర్రా శివన్నారాయణ, కొమ్మి ప్రభాకర్ ఉన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉదయగిరి : స్థానిక ఎంఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రూ.5 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేయనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

చర్చి నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యే ఇంటూరి చేతుల మీదుగా విరాళం అందజేస్తున్న మాల్యాద్రి

కందుకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడులో చర్చి నిర్మాణం కోసం టీడీపీ నాయకుడు రెబ్బవరపు మాల్యాద్రి రూ. లక్ష విరాళం అందజేశారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈమొత్తాన్ని ఆయన నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, రావుల రవి పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో బహుళ ప్రయోజనాలు



ఉదయగిరి: రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి

ఉదయగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుతో రైతులకు అన్ని సంక్షేమ పథకాలు చేరువవుతాయని జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ఆధార్, పొలం పాసు పుస్తకం, ఆధార్‌తో లింకైన ఫోన్ తీసుకొని తమ పరిధిలోని రైతుసేవా కేంద్రానికి గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల వద్దకు వెళ్లి విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సబ్సిడీ విత్తనాలు, బీమా, పంట నష్ట పరిహారం, పంట రుణాలు తదితరాలు రానున్న రోజుల్లో ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే దక్కుతాయన్నారు. రైతులకు అన్ని ఎరువులతోపాటు యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శేషగిరి, నర్సోజీరావు, వ్యవసాయాధికారి అంజనేయులనాయక్, ఏఈవో వినోద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : రైతులందరూ ఈనెల 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ తెలిపారు. బుధవారం ఆమె మండల వ్యవసాయ అధికారిణి రజనితో కలసి కొండమీదకొండూరు, కుప్పూరుపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు రైతులకు అందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఈవో చిరంజీవి, వీఏఎలు పాల్గొన్నారు.

ఆటోల్లో ఓవర్‌లోడ్ వద్దు : ఆర్టీవో



ఉలవపాడు : మాట్లాడుతున్న రాంబాబు

కందుకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీవో టీవీఎస్ లక్ష్మి హెచ్చరించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటించకుంటే, కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సీహెచ్ రాంబాబు పాల్గొన్నారు.

● ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని కందుకూరు ఎంఈఐ చెన్నూరి రాంబాబు తెలిపారు. బుధవారం ఉలవపాడులోని ట్రక్ ఆటో యూనియన్ కార్యాలయం వద్ద 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా వెంట ఉండాలని తెలిపారు. అనంతరం అధికారులను ఆటో కార్మికులు శాలువాలతో సత్కరించారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవారిపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు యనమల నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. వీఆర్వోలు, సర్వేయర్ గ్రామంలోని భూముల వద్దకే వచ్చి సమస్యల పరిష్కారానికి రీసర్వే చేస్తున్నారని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గండిపాళెంలో భయం.. భయం

కోతులు, కుక్కల బెడదతో బెంబేలెత్తుతున్న జనం



వీధుల్లో సంచరిస్తున్న శునకాలు



నివాసాల్లో కోతుల వీరంగం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెంలో కోతులు, కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బస్టాండ్ సెంటరు, ప్రధాన వీధులు, పాఠశాలలు, వైద్యశాలల సమీపంలో గుంపులు, గుంపులుగా సంచరిస్తుండడంతో అటు వైపు ప్రయాణాలు సాగించే ప్రజలు, వాహనదారులు వాటి నుంచి తప్పించు కునేందుకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలను వెంటాడుతుండడంతో నివాసాల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. కుక్కల బారి నుంచి తప్పించుకున్నామని ఊపిరి పీల్చుకొంటున్న తరుణంతో ఏకంగా కోతులు నివాసాల్లోకి దూసుకెళ్లి వీరంగం సృష్టిస్తున్నాయి. దీంతో అటు నివాసాల్లో ఉండలేక, ఇటు బయటకు వెళ్లలేక నానా యాతన అనుభవించాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. వాహనదారులను సైతం రహదారుల వెంట వెంబడిస్తుండడంతో తప్పించుకునే క్రమంలో పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈనేపథ్యంలో కొంతమంది చేతిలో కర్రలు పట్టుకొని ప్రయాణాలు సాగిస్తుండగా, మరికొంతమంది వాటి బారి నుంచి తప్పించుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా తీసుకెళ్లి పాఠశాల వద్ద వదిలి వస్తున్నారు. పగలు ఎలాగోలా కాలం గడిపినప్పటికీ రాత్రి సమయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఇటీవల కుక్కల దాడికి గురైన ఓ వ్యక్తి వైద్యం కోసం పరుగులు తీసిన సమయంలో తీరా వైద్యశాల వద్ద కూడా మరోమారు కుక్కలు దాడికి పాల్పడడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతులు, కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



సంగం: సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న అర్చకులు

సంగం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీ కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం రమాదేవి సమేత సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు క్షీర, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

రాజరాజేశ్వరి ఆలయంలో...

తిరుమనకొండలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూలంగిసేవ ఏర్పాటు చేశారు. కుంకుమార్చన, లలిత సహస్రనామం, హోమం నిర్వహించి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

●సీతారామపురం: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

కావలి : పట్టణంలోని పెద్ద చెరువువద్ద ఉన్న కూచి చినమాలకొండయ్య క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్ల కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలు మధ్య సాగిన కల్యాణోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శాశ్వత మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు.

ఆర్పీపాలెంలో మహా చండీయాగం

రూరల్ మండలం రాజువారి చింతలపాలెం(ఆర్పీపాలెం)లోని శ్రీవిజయదుర్గ ఆస్థానపీఠంలో పీఠాధిపతి వీర బ్రహ్మయ్యస్వామి ఆధ్వర్యంలో బుధవారం శ్రీ మహాగణపతి లక్ష్మీమహా చండీ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చండీ యాగంలో పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడికి ఏకాంత సేవ

కావలిటౌన్: పట్టణంలోని హనుమత్ క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారికి ఏకాంతసేవ నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయాణాచార్యులు పర్యవేక్షణలో ముందుగా స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం తోమాలసేవ, హోమం పూజలు చక్రస్నానం జరిగాయి. సాయంత్రం ఆలయ ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. గురువారం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట : బోగోలు మండలం చెన్నారెడ్డిపాలెం కొత్తూరులో ఉన్న పోలేరమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూడురోజులపాటు సద్ది, పొంగళ్లు, మొక్కులతో జాతర ముగిసింది. అమ్మవారిని శాంతింప చేయడానికి వేద పండితులు పసుపు, డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్తలు కైపు సుబ్బారెడ్డి, యారం శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు.

వెంగమాంబ సన్నిధిలో వేలంపాటలు

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నర్రవాడ శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో బుధవారం దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వివిధ హక్కులు పొందేందుకు బహిరంగ వేలం, టెండర్లు నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కును బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన సుబ్బరాయుడు రూ.16.10 లక్షలకు, ఎండుకొబ్బరి అమ్ముకునే హక్కును నర్రవాడకు చెందిన నక్క నాగ భూషణం రూ. 9.6 లక్షలు, కూరగాయలు సరఫరాను టెండర్ ద్వారా వెంకటాద్రి, ప్రింటింగ్ హక్కును నెల్లూరు గణేష్ గ్రాఫిక్స్ దక్కించుకున్నారు. ఇతర వేలం పాటలు వాయిదా పడ్డాయని ఈవో ఉషశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ తుమ్మల వెంకట సురేష్‌బాబు, పూడిపర్తి రామ లింగేశ్వర స్వామి ఆలయ ఈవో ఎన్ శ్రీధర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యంషాపు ఏర్పాటును అడ్డుకున్న మహిళలు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాశిలి గ్రామంలోని అరుంధతి కాలనీ వద్ద మద్యంషాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. మద్యం షాపు ఏర్పాటు పనులను మహిళలు అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఈమేరకు వారు ఆత్మకూరు ఆర్డీవో పావని, ఎక్సైజ్ సీఐ వెంకట రమణమ్మకు వినతిపత్రం అందజేశారు.

రక్తదానం సామాజిక బాధ్యత

కావలి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద రక్తదానం సామాజిక బాధ్యతని జిల్లా ప్రజారవాణా అధికారి మురళీబాబు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం కావలి డిపో గ్యారేజి ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఎక్కువసార్లు రక్తదానం చేసిన సుబ్బారావు, రవికుమార్, శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ ఉద్యోగి కుమారుడు నచికేత్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఎం రాపూరు శ్రీనివాసులు, ఇతర అధికారులు కల్పనా రెడ్డి, ఖాజామొహిద్దీన్, ఎం. రామకృష్ణ, రవి ప్రకాష్, రఘునాథరెడ్డి, చెంచురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్ మృతి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హసనపురం గ్రామానికి చెందిన రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్ ప్రభాకార్‌రెడ్డి (45) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కార్పొరేట్ ప్రయోజనాలకే కేంద్ర బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నేతలు

కావలి,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కలిగించేలా కేంద్ర బడ్జెట్ ఉందని వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్షాల నేతల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చేలా ఉందని, బడ్జెట్‌లో ప్రజల కొనుగోలు శక్తి పెంచే ఒక్క పథకం కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేటీకరణ చేసేందుకు బడ్జెట్ అని, అధిక ధరల అదుపుకుకాని, కార్మికవేతనాలు పెంచేందుకుకాని ఉపయోగపడదన్నారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు పసుపులేటి పెంచలయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, నాగరాజు, లక్ష్మీరెడ్డి, కరువాది భాస్కర్, కృష్ణమోహన్, మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరును తిరిగి 'ప్రకాశం'లో కలపాలి

కందుకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కోరారు. బుధవారం సాయంత్రం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న సీఎం చంద్రబాబునాయుడు కందుకూరు వస్తున్న సందర్భంగా ఈమేరకు ఆయనకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వినతిపత్రం అందజేయనున్నామని తెలిపారు. అలాగే కందుకూరు మండల కార్యాలయాల ఆవరణలో ఐఓసీ పెట్రోలుబంకు ఏర్పాటు నిర్ణయాన్ని రద్దుచేసేలా చర్యలు తీసుకోవాలని, పెట్రోలుబంకు ఏర్పాటు జరిగితే ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని వివరిస్తూ ఓ వినతిపత్రం అందచేస్తామన్నారు. రాళ్లపాడు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సీఎంకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు తోకల వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, పిన్నంరాజు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జీ.అయ్య వారిపల్లి పంచాయతీ దేకూరుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ క్రియాశీలక సభ్యుడు పెరుమాళ్ల రమణయ్య బుధ వారం అనారోగ్యంతో మృతిచెందడంతో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరంగరావు నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ నాయకుడు ముడమాల రమేష్‌రెడ్డి అందజేసిన రూ.10 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నెల్లూరు వెంకటస్వామినాయుడు, మేకపాటి మాల్యాద్రినాయుడు, ఆవుల రోశయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి....

సంగం, ఫిబ్రవరి 12: అన్నారెడ్డిపాళెం మజరా పల్లిపాళెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం కాగా బాధిత మహిళ నెల్లూరు రమణమ్మకు ఆత్మకూరు జనసేన పార్టీ నాయకులు బుధ వారం ఆర్థిక సాయం అందచేశారు. ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, చిరంజీవి యువత అధ్యక్షుడు భానుకిరణ్, సీనియర్ నాయకులు చదలవాడ హరీష్, మావిళ్ల హరికృష్ణ తమ సొంత నిధులు రూ. 12వేల నగదు, నెలకు సరిపడా బియ్యం, నిత్యవసర సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 26 మందికి ఉద్యోగాలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయమెంట్ ఆఫీస్, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అరిస్ ఆగ్రో లిమిటెడ్, వీల్ ఇండియా లిమిటెడ్, అమర్‌రాజా బ్యాటరీస్. గ్రీన్‌టెక్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూకు 56 మంది అభ్యర్థులు హాజరుకాగా 26 మందిని ఎంపిక చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూమ్, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

పట్టణంలోని ఏఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో బుధవారం ఎమ్ఎస్‌సీ, మహేంద్ర టెక్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలను కైవసం చేసుకున్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ యం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ఎ శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్ డి ప్రసాద్, ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసులరెడ్డి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

జేవీవీ కృషి అభినందనీయం

కావలిటౌన్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుటకు జేవీవీ చేస్తున్న అభినందనీయమని డాక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం జేవీవీ కార్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. కావలి శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను పారదోలేందుకు, సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించేందుకు జేవీవీ ఉద్యమరూపంలో ముందుకు పోవడం గొప్పవిషయమన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, సభ్యులు హరనాథ్, ఆకుల రమణయ్య, సుబ్బరాయశర్మ, కల్యాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జలవనరుల గణనపై శిక్షణ

అనంతసాగరం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం చిన్నతరహా నీటి వనరుల గణనపై వీఆర్వో, వీఆర్ఏలకు మండల అధికారులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామంలో భూగర్భ వనరులు చెరువులు, కుంటలు, బోర్లు, బోరుబావులకు సంబంధించి వివరాలు సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం సమాచారాన్ని జియోట్యాగింగ్ చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు సుభాషిణి, ఏఎస్వో మోహన్, ఇరిగేషన్ ఏఈ లీలాకుమారి పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డు పనుల ప్రారంభం

ఉదయగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీనగర్‌లో బుధవారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ ప్రారంభించారు. రూ.5 లక్షల ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరాజు, గుత్తేదారు మజీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అక్షరాస్యులు కావాలి

లింగసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్షర వెలుగు కేంద్రాల ద్వారా మహిళలందరూ అక్షరాస్యులుగా మారాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం కె సింహాద్రిరావు అధ్యక్షతన బుధవారం ఉల్లాస్ అక్షర వెలుగు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, ఉపాధి పనులకు వెళ్లే మహిళలందరూ మస్టర్లలో వేలిముద్రలకు బదులు సంతకాలు చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో షేక్ సమీర్ బాషా, సీసీలు నారాయణమ్మ, మాధవ, మాధవరావు, అర్చన పాల్గొన్నారు.

ఖాళీ చేయనందుకు పోస్టాఫీసుకు తాళం

అల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఖాళీ చేయమని ఎన్నిసార్లు చెప్పినా, వినిపించుకోక పోవడంతో ఇంటి యజమాని పోస్టాఫీసుకు తాళం వేశారు.ఈ సంఘటన అల్లూరు తూర్పువీధిలో బుధవారం చోటు చేసుకుంది. పోస్టాఫీసు శాశ్వత భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పదేళ్లుగా తూర్పువీధిలోని ఓ ఇంటిలో తాత్కాలికంగా దాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ఖాళీ చేయమని ఇంటి యజమాని పలుమార్లు కోరినా ఖాళీ చేయకపోవడంతో బుధవారం గేటుకు తాళం వేశాడు. దీంతో అధికారులు ఫోన్ చేసినా యజమాని స్పందించకపోవడంతో సిబ్బంది వెనుతిరిగారు.

చిత్తలూరు పీహెచ్‌సీ తనిఖీ

చేజర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తలూరు గ్రామంలోని పీహెచ్‌సీ కేంద్రాన్ని బుధవారం ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎస్కే ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సిబ్బంది పని తీరును వైద్యశాలకు వస్తున్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో అందిస్తున్న వివిధ రకాల వైద్య పరీక్షలకు వస్తున్న వారి వివరాలను పరిశీలించారు. అదేవిధంగా చిత్తలూరు గ్రామంలోని టిబి పేషంట్ ఇంటి వద్దకు వెళ్ళి ఆరోగ్యంపై అరాతీశారు. అనంతరం ఆదురుపల్లిలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తలూరు పిఎచ్‌సి వైద్యాధికారి డా. నవీన్ కుమార్, డిస్ట్రిక్ట్ ప్రోగాం కోఆర్డినేటర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని ఎస్టీ కాలనీ వాసులకు బుధవారం క్యాన్సర్, బాల్య వివాహాలపై గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శివకల్పన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె రొమ్ము, నోటి, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాది సందిరెడ్డి రామారావు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ట్యాంకుల శుభ్రం

లింగసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని మంచి నీటి ట్యాంకులను బుధవారం అధికారులు శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేశారు. పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం, లింగ సముద్రం, జంగంరెడ్డిపాలెంలోని నీటి ట్యాంకులను పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు, రాళ్లపాడు-రేళ్లపాడు నీటి పథకం సిబ్బంది ద్వారా శుభ్రం చేయించారు. నెల క్రితం ఈ ట్యాంకులను కడిగించామని పంచాయతీ కార్యదర్శి చెప్పారు.

శేషగిరిరావుకు ఘన సన్మానం

కొండాపురం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): కొమ్మి గ్రామంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన వై.ఎస్ శేషగిరిరావును పంచాయతీలోని రామానుజపురం రైతులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు, గుమ్మా శ్రీనివాసులు, బెల్లం నరసింహరావు, ఎర్రయ్య, మాల్యాద్రి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

15 వరకు దరఖాస్తు గడువు పెంపు

వింజమూరు : బీసీ, ఈబీసీ, కాపు, రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్లకు దరఖాస్తు గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అనుభవాలను ఇతరులతో పంచుకోవాలి

● వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత, యూబీఐ రీజనల్ హెడ్ రాజశేఖరం

వెంకటాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు నేర్చుకున్న తమ అనుభవాన్ని ఇతరులతో పంచుకోవాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు సూచించారు. మండల పరిధిలోని వీఎస్‌యూలో బుధవారం జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పవన్ సాయి, స్నేహభవాని, ఆదిత్య, హనోక్, హదిస్సిలను ఆయన ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

● అంబులెన్స్ ప్రారంభం

వీఎస్‌యూకి యూబీఐ అందజేసిన అంబులెన్స్‌ను ఆ బ్యాంక్ రీజనల్ హెడ్ ఏ.రాజశేఖరంతో కలిసి వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి అత్యవసర వైద్య సేవలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ అంబులెన్స్‌ను అందజేసిందన్నారు. ఈ కార్యక్రమాల్లో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై విజయ, కావలి పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ టీ వీరారెడ్డి, యూబీఐ బీఎం ఆర్.రామ్మోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ ఎం హుస్సేనయ్య, డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి చిన్నతరహా సాగునీటి పథకాల గణన



మాట్లాడుతున్న డీవైఎస్‌వో ఇందిరమ్మ

మనుబోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి రెవెన్యూ సిబ్బంది చిన్నతరహా సాగునీటి పథకాలపై గణన చేయాలని నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ఉప డీవైఎస్‌వో ఇందిరమ్మ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఆమె వీఆర్‌వోలు, ఆర్ఐలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ భూగర్భజలాల పెంపుదల కోసం ఈ తరహా గణన అవసరమన్నారు. దీనిపై ప్రభుత్వం ఒక యాప్ ఇస్తుందని, దానిని వీఆర్‌వోలు ఫోన్‌లో అనుసంధానం చేసుకుని చెరువులు, బోర్లు, లిఫ్టులు వద్దకు వెళ్లి జియోట్యాగింగ్ ద్వారా నమోదు చేయాలన్నారు. 2వేల హెక్టార్ల కింద సాగయ్యే పథకాలు మాత్రమే ఈగణన పరిధిలోకి వస్తాయన్నారు. మార్చి నెలాఖరుకల్లా ఈ సర్వే పూర్తికావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య, ఇరిగేషన్ ఏఈ.కృష్ణ, ఏఎస్‌వో గాయత్రి, ఆర్ఐ. శ్రీకాంత్ పాల్గొన్నారు.

జీవో-30పై సర్వే చేయండి

వీఆర్‌వోలు జీవో నెం.30పై సర్వే చేయాలని తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుని ఉంటే వాటిని సర్వే చేయాలన్నారు. 150 గజాల్లోపు ఇళ్లు వేసుకుని ఉన్నవారికి ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ పత్రాలు ఇస్తుందన్నారు. అంతకు మించి స్థలం ఉంటే ప్రభుత్వ ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు. అభ్యంతరం లేని స్థలాలకు మాత్రమే ఉచిత రిజిస్ట్రేషన్ వర్తిస్తుందన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్ కొరకు లబ్దిదారులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పులు చేయాలి : డీఎంహెచ్‌వో



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై వైద్యాధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్‌తో చర్చించారు. ఇటుక బట్టీలు, చేపల చెరువులు, రొయ్యల ఫ్యాక్టరీల పరిసరాల్లో నివాసం ఉండే పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్ పరిసరాల్లో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్‌సూపర్‌వైజర్ సతీష్‌బాబు, సీసీ మురళీకృష్ణ, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో వైద్య శిబిరం తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌వోతో ఖాదర్‌వలి

పొదలకూరు : పొదలకూరు పట్టణంలోని బిట్-1 సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వైద్య శిబిరాన్ని అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదరవలి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా వారం రోజులకు మించి దగ్గుతో పాటు జ్వరంతో ఉంటే వారికి వెంటనే క్షయ వ్యాధి నిర్ధారణ కొరకు పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ కేసులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వారికి వెంటనే చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీకావ్య, ఆరోగ్య సహాయకులు ఎం.రాధాకుమారి, సానిశివప్రసాద్, మిడ్లెవల్ హెల్త్ ప్రొవైడర్ సుమాంజలి, సచివాలయం కృష్ణమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌ను కలిసిన జనసేన నేతలు



ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జనసేన నేతలు

వెంకటాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి, కసుమూరు, గొలగమూడి గ్రామాల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులకు నెల్లూరులో బస్‌స్టాప్‌ను మార్చాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డిని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు కోరారు. మేరకు బుధవారం ఆయనతో ఆర్టీసీ ఉన్నతాధికారులను కలసి వినతిపత్రం అందజేశారు. బస్టాప్ పక్కన దుర్గంధం వెదజల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



ముదివర్తిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టరు

విడవలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని ఓ పక్క కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశిస్తున్నా.. కొందరు లెక్కచేయకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. అందులో భాగంగా బుధవారం మండలంలోని ముదివర్తిలో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా ఓ రైతు పొలంలో మట్టి తవ్వకాలను చేపట్టారు. ఈ విషయంపై ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాలను అడ్డుకుని నిలిపివేశారు. అప్పటి వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని కోవూరు మండల పరిసర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా స్థానిక వీఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మట్టిని తవ్వేందుకు తప్పనిసరిగా తహసీల్దారు అనుమతి తీసుకోవాలని సూచించారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి

● స్థల శుభ్రత ఖర్చులు వారి నుంచే వసూలు ● ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ



ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య ఉండే ఖాళీ స్థలాలను శుభ్రం చేసేందుకు వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం నగరంలోని పరమేశ్వరీనగర్, ఇరగాళమ్మ సంఘం ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఖాళీ స్థలాల్లో కంప చెట్లు, మురుగు పెరిగిపోవడం వల్ల దోమలు, దుర్వాసన వ్యాపిస్తోందని చెప్పారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఖాళీ స్థలాల వివరాలు తెలుసుకుని వాటి యజమానులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. స్థలాలను శుభ్రం చేసి ఆ ఖర్చును యజమాని నుంచే వసూలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ ఖాళీ స్థలానికి విధిగా పన్ను విధించి వసూలు చేయాలన్నారు. కాగా, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని ఏడీసీ నందన్ సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమీక్షలో తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రైవేట్ కాలేజీల హవా



నారాయణ విద్యార్థుల అభినందన



కృష్ణచైతన్య విద్యార్థుల అభినందన

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో నగరంలోని ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో జాతీయ స్థాయిలో సత్తా చాటారు. పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు.

'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు జనరల్ కేటగిరిలో కే పూర్వజ్ మ్యాథ్స్‌లో 100కు 100 మార్కులతో 99.98 పర్సంటైల్ సాధించాడన్నారు. ఎం మధుకిరణ్‌రెడ్డి 99.93, బీ భానురిషిక్ 99.92, ఎం అఖిలేష్ 99.91, ఎం హేమంత్ సాయి 99.84, సీహెచ్ నరసింహతేజ 99.76, కే ఆశ్రిత 99.74, జీ సంతోష్ 99.71, ఈ యశ్వంత్ బాబీ 99.70 పర్సంటైల్స్ సాధించారన్నారు. వీరితోపాటు 99 పర్సంటైల్‌కుపైగా 35 మంది, 98 పర్సంటైల్‌కుపైగా 62 మంది, 97 పర్సంటైల్‌కుపైగా 87 మంది, 95 పర్సంటైల్‌కు పైగా 138, 90 పర్సంటైల్‌కుపైగా 232 మంది సాధించారన్నారు. అందరి కృషి, పటిష్టమైన మైక్రో షెడ్యూల్, బోధనా పద్ధతులతో ఈ ఫలితాలు సాధించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'విశ్వసాయి' విజయం



విశ్వసాయి కళాశాల విద్యార్థి సాయిరూపేష్

విశ్వసాయి కళాశాల విద్యార్థులు 60 మందికిపైగా జాతీయ స్థాయిలో విజయం సాధించారని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన సీహెచ్ సాయి రూపేష్ 98.66 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 90 పర్సంటైల్‌కు పైగా 10 మంది విద్యార్థులు, 80 పర్సంటైల్‌కుపైగా 45 మంది సాధించారన్నారు. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల, స్ట్రెస్ ఫ్రీ ఎడ్యుకేషన్, ఫైవ్ స్టెప్స్ ప్రోగ్రామ్స్ ద్వారా ఈ విజయాలు సొంతమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విజయభేరి





శ్రీ చైతన్య విద్యార్థులు స్వరూప్, సౌమ్యశ్రీ



ఉషాశ్రీ

శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు జేఈఈలో విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థ డీన్ జీ శ్రీరామ్ తెలిపారు. బుధవారం నగరంలోని కళాశాల ప్రాంగణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు కేజే స్వరూప్ 99.04, ఎం సౌమ్యశ్రీ 98.18, ఎస్‌వీ ఉషాశ్రీ 95.10, కే పవన్ 93.48, బీ దినేష్ 93,08 పర్సంటైల్ సాధించారన్నారు. 90 పర్సంటైల్‌కుపైగా 22 మంది, 85 పర్సంటైల్‌కు పైగా 40 మంది, 80 పర్సంటైల్‌కుపైగా 52 మంది సాధించారని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కృష్ణచైతన్య' విద్యార్థుల సత్తా

కృష్ణచైతన్య కళాశాల ఐన్‌స్టీన్ క్యాంపస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్సంటైల్స్‌తో సత్తా చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన పీ నిర్మల్ తేజ 98.83, ఎండీ అస్జల్‌సైఫీ 97.75, కే అభినవ్‌రెడ్డి 97.70, పీ సాయికేతన్‌రెడ్డి 96.76, కే మౌనిక 96.44 పర్సంటైల్ సాధించారన్నారు. 11 మంది విద్యార్థులు 95 పర్సంటైల్‌కుపైగా, 21 మంది విద్యార్థులు 90 పర్సంటైల్‌కుపైగా సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల డీన్ రామాంజనేయులు రెడ్డి, అకడమిక్ డీన్ రాంగోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్ పాల్గొన్నారు.

'ఓవెల్' ఉత్తమ ఫలితాలు

ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఆర్ వేణు తెలిపారు. నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు ఎంవీ సుధా హేమంత్ 99.43 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచాడన్నారు. ఈ కృష్ణవంశీ 98.52, ఎస్‌డీ అఫ్జల్ షరీఫ్ 98.26, వీ బాలహర్షిత 98.02, ఆర్ యశ్వంత్ 94.81, ఏ దుర్గా హనుమంత ప్రసాద్ 94.66, వై.వి.సాయి చరణ్‌తేజ్ 94.19 పర్సంటైల్ సాధించారన్నారు. 91 పర్సంటైల్‌కు పైగా 18 మంది సాధించారని చెప్పారు. అత్యున్నతమైన విద్యా ప్రణాళిక, బోధనతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో ప్రమీల, జీఎం మహదేవన్, ఈడీ బాలు, ఏజీఎం గంగాధర్, టీమ్ లీడర్ సుధీర్, ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి ఏఎం విద్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఓవెల్ కళాశాల విద్యార్థుల అభినందన

ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్లు సభ్యత్వం తీసుకోవాలి

● విశ్రాంత డ్రైవర్ల సంఘం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంఘం జిల్లా శాఖ సమావేశం నగరంలోని పెన్షన్ భవన్‌లో బుధవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు షేక్ కాలేషా మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంక్షేమం కోసం అసోసియేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. తాను అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పీ పాపారావుని రాష్ట్ర సంఘం నియమించిందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ వాహన డ్రైవర్లు అందరూ ఈ సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తమ సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్స్ సంఘం, రాష్ట్ర ప్రభుత్వ నాన్ గెజిటెడ్ పెన్షనర్స్ సంఘం సహకరిస్తాయని తెలిపారు.

ఐటీఐ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం ఎన్‌వైకే ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో యువత అత్యధికంగా మత్తు పదార్థాలను వినియోగిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి, సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు, ఐటీఐ ప్రిన్సిపాల్ కే శ్రీధర్ రెడ్డి, సిబ్బంది శరవణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 3.5 లక్షల మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, దానిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అడిషనల్ క్వాంటం పెన్షన్‌ను పాత పద్ధతిలో 10, 15 శాతంగా పెంచాలని, మూడు వాయిదాల డీఆర్‌ను పెంచాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు నాగరాజు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ విద్యా సామగ్రి వితరణ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు రంగనాయకులపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు బుధవారం రూ.5.87 లక్షల విలువైన విద్యా సామగ్రిని వితరణ చేశారు. రేకుల షెడ్డు, 5 కంప్యూటర్లు, 14 కుర్చీలు, 3 ఫ్యాన్లు, పాఠశాల సిబ్బందికి నాలుగు టేబుళ్లు, విద్యుత్ గంట తదితరాలను బ్యాంకు జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ శేషగిరి, సురేష్, ఎం మిశ్రమ, లక్ష్మీప్రసన్న, హెచ్ఎం కల్పనాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని 22వ డివిజన్, రూరల్ మండలంలోని ములుముడి, కొమ్మ రఘూడి గ్రామాల్లో రూ.2.20 కోట్ల విలువైన సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధ వారం శంకుస్థాపన చేశారు. గత వైసీపీ పాలనలో టెంకాయలు కొట్టి సరిపెట్టుకునే బ్యాచ్‌కి చెందిన వ్యక్తిని కాదన్నారు. ఒకసారి శంకుస్థాపన జరిగితే ఆ పని ఎప్పుడు పూర్తవుతుందో చెప్పి మరీ పనులు మొదలు పెట్టిస్తానని తెలిపారు. కొమ్మరఘూడిలో ఎత్తిపోతల పథకానికి కృషి చేస్తున్నామన్నారు. కాగా, వైఎస్ఆర్ నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు.

రోడ్ల పక్కనే చెత్త : పట్టించుకునేవారేరీ!?



కాకుటూరులో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

వెంకటాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు గ్రామాలు విశాలంగా ఉండేవి. జనాభా తక్కువగా ఉండడంతో గడ్డివాములకు, ఎరువు వేసుకోవడానికి ప్రత్యేక స్థలాలు ఉండేవి. కానీ నేడు జనాభా పెరిగిపోవడం వల్ల ఇళ్లకే స్థలాలు చాలడం లేదు. దీంతో కొందరు రోడ్లను చెత్త కేంద్రాలుగా, పేడదిబ్బలుగా వాడేస్తున్నారు. మరికొందరు తమ ఇళ్లల్లోని చెత్తతోపాటు పేడను కూడా రోడ్లపైనే వేస్తున్నారు. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. వర్షాలు వచ్చినపుడు రోడ్లపై పేడ, నీరు వ్యాపిస్తోంది. దీంతోపాటుగా రోడ్డు పక్కన వేసిన చెత్త, చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు గాలికి పైకి లేచి వాహనదారులపై పడుతున్నాయి. పరిసరాలు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోన్నాయి. పారిశుద్ధ్యం గురించి ప్రచారాలు చేసే పంచాయతీ అధికారులు ఈ చెత్త గురించి పట్టించుకోవడం లేదు. ఈ చెత్త సమస్య దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఉంది. ముఖ్యంగా కసుమూరు, కనుపూరు, ఇడిమేపల్లి, కంటేపల్లి, అనికేపల్లి, గొలగమూడి, కురిచెర్లపాడు, చవటపాళెం, కందలపాడు, తాటిపర్తిపాళెం, ఎగువమిట్ట, పూడిపర్తి, సర్వేపల్లి, పుంజులురుపాడు, గూడ్లూరువారిపాళెం, ఇడిమేపల్లి, జంగాలపల్లి, రామదాసుకండ్రిగ, కాకుటూరు తదితర గ్రామాల్లో ఎక్కువగా ఉంది. వర్షాల సమయంలో ఇటువంటి చెత్త నిల్వలు, పేడ దిబ్బల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించి వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. చెత్త నిల్వల వల్ల దోమల బెడద కూడా గ్రామాల్లో అధికంగా ఉంది. కొన్ని గ్రామాల్లో అయితే పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు మరింత అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా దీని పై పంచాయతీ అధికా రులు స్పందించి చెత్త, పేడ దిబ్బలను తొలగించాలని ప్రజలు కోరుతు న్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా శ్రీవారి తిరుమంజనం



తిరుమంజనం సేవలో అర్చకుడు, భక్తులు

పొదలకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో వెలిసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం తిరుమంజనం సేవ వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పాలు, తేనె, పెరుగు, నారికేళం, చందనాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహనాచార్యులు పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయానికి వేంకటేశ్వర స్వామి, అమ్మవార్ల విగ్రహాలను బహూకరించిన దాతలు నున్నా మల్లికార్జున-భాను లోకప్రియ, శ్రీనివాస కృష్ణమోహన్-ఉమా మహే శ్వరి, నవీన్-శ్రావణి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

18న రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణల తొలగింపు

విడవలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విడవలూరు పంచాయతీ పరిధిలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలను ఈనెల 18వ తేదీన తొలగించనున్నట్లు తహసీల్దారు చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకాయుక్త ఆదేశాల మేరకు బుధవారం తొలిగింపు కార్యక్రమం చేపట్టాల్సి ఉండగా భద్రత కారణాల దృష్ట్యా వాయిదా వేశామని పేర్కొన్నారు.

రవిబాబు దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

● టీడీపీ నేత బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మన్యం జిల్లాలో గిరిజనులు భయభ్రాంతులకు గురయ్యేలా ఎమ్మెల్సీ కుంభ రవిబాబు దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని నమ్మొద్దని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల బాల సుబ్రహ్మణ్యం గిరిజనులను కోరారు. బుధవారం ఆయన నగరంలోని ఇరుగాళమ్మ గుడి వద్ద విలేకరు లతో మాట్లాడారు. 1/70 జీవోపై సవరణలు జరుగుతున్నాయని, ఆస్తులు, హక్కుల విషయంలో గిరిజనులకు అన్యాయం జరగబోతోందనే ప్రచారం వాస్తవం కాదన్నారు. ఈ సమావేశంలో వై చంద్రశేఖర్, కే దాసు, ఏ రమణయ్య, ఐ శ్రీను, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పంట కాలువలపై ఆక్రమణల తొలగింపునకు సర్వే

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని పంట కాలువలపై ఆక్రమణల తొలగింపు కోసం సర్వేకి ఆదేశించినట్టు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. చెన్నూరురోడ్డులో ఆక్రమణలు తొలగింపు చర్యల్లో భాగంగా పీర్లకాలువ, పాత, కొత్త గుడపల్లి కాలువలు, రేబాల కాలువ, మలిదేవి, మర్రికాలువలపై ఆక్రమణలు తొలగింపుపై సర్వే చేయించాలనీ, ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదులు పెట్టారన్నారు. అదేవిధంగా నూతన కూరగాయల మార్కెట్ ఏర్పడుతున్న నేపథ్యంలో మార్కెట్‌కు వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చెన్నూరు రోడ్డులో ఆక్రమణలపై విస్తరణ కోసం మార్కింగ్‌కు ఆదేశించినట్టు తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఈబీసీ రుణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు


మనుబోలు, (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వం అందజేయనున్న రుణాలకు దరఖాస్తు గడువు బుధవారంతో ముగిసిందని, అయితే ఈబీసీలకు మాత్రం 15వ తేదీ వరకు పొడిగించిందని ఎంపీడీవో జలజాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఈబీసీలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో 'విజ్ఞాన్' విద్యార్థుల హవా

పొదలకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ విడుదల చేసిన ఐదోవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్.రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో టాపర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.నారాయణరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సుబ్బా రావు, అకాడమిక్ ఇన్‌చార్జ్ సీహెచ్.కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఏ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.







ఆడెనమ్మా ! శివుడు.. పాడెనమ్మా ! భవుడు

"మొలక మీసపు గట్టు, ముద్దు చందురుబొట్టు.. పులితోలు హొంబట్టు, జిలుగు వెన్నెల పట్టు.." అంటూ పుట్టపర్తి నారాయణాచార్యులు శివతాండవం కావ్యంలో వర్ణించిన దృశ్యం బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తిలో సాక్షాత్కారమైంది. శివుడి ఢమరుకంపై తాండవమాడుతూ సూర్యుడు పడమట అస్తమించగా, తూరుపున పుట్టిన చంద్రుడు స్వర్ణమ్మలో అందాలు దిద్దుకుని, గోపురం మీదుగా ఆకాశానికెగసి, కన్నప్ప కొండమీద కొలువైన శివపార్వతుల సిగలో నగలాగ ఇమిడిన అపురూప దృశ్యాలు ఇవి. ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ కెమెరాకు చిక్కాయి.

టిప్పర్‌కు మట్టిని లోడ్ చేస్తూ..



ఎర్ర బంగారం

ఎర్ర బంగారం..గా పిలుచుకునే గ్రావెల్ తరలిపోతోంది. వారం కిందటే ఆర్డీవో రెండు హిటాచీలను సీజ్ చేశారు. గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా.. అదే భూముల నుంచి మళ్లీ తవ్వి తరలిస్తున్నారు. అధికారులేమో చూసీ చూడనట్లు ఉంటున్నారు.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి



గ్రావెల్ తవ్వకంతో భారీ గోతులు

తరలిపోతూనే ఉంది

- వారం కిందట యంత్రాలను సీజ్ చేసిన ఆర్డీవో
- మళ్లీ అదే భూముల్లో గ్రావెల్ తవ్వకం.. తరలింపు
- 'అధికార' అండతో చెలరేగిపోతున్న అక్రమ రవాణాదారులు

దొరవారిసత్రం మండలంలోని పూలతోటమిట్ట ఎర్ర బంగారంగా పిలవబడే గ్రావెల్ మట్టి అక్రమ రవాణాకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడి అసైన్డ్ భూముల నుంచి యథేచ్ఛగా తవ్వి.. తరలిస్తున్నారు. ఆ గ్రామంలోని గిరిజనులు, దళితులకు 1982, 1991లో రెండు విడతలుగా 110 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను ప్రభుత్వం పంపిణీ చేసింది. అందులో 40 ఎకరాలు గిరిజనులవి. వీరి భూములను కొందరు దళితులే కొన్నారు. ఈ మెట్ట భూములను 2018లో అప్పటి ప్రభుత్వం అసైన్డ్‌గా మార్చి పట్టాలు మంజూరు చేసింది. ఆ భూముల్లో సాగు చేసుకోవడం మానేసి గ్రావెల్ అక్రమ రవాణదారులకు రైతులు అమ్ముకొంటున్నారు. ఒక ఎకరాలో గ్రావెల్ తీస్తే రూ.2.5 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఈ ప్రక్రియలో దళారులూ రంగ ప్రవేశం చేశారు. ఇక్కడి గ్రావెల్ నాణ్యమైనది కావడంతో డిమాండు ఎక్కువ. స్థానికంగా జరిగే రైల్వే పనులతో పాటు సూళ్లూరుపేట, తడ, శ్రీసిటీ ప్రాంతాల్లోని పరిశ్రమలు, లేఅవుట్లను చదును చేయడానికి ఇక్కడి గ్రావెల్‌ను తీసుకెళుతున్నారు.

'అధికార' అండతో..

గతంలో టిప్పర్లున్న వారు గ్రావెల్ రవాణా చేసే వారు. ఒక టిప్పరును రూ.8 వేల వరకు విక్రయించేవారు. ఇప్పుడు ఒకరిద్దరు గ్రావెల్‌ను రవాణా చేస్తూ.. ఒక టిప్పర్‌ను రూ.16,800కు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. దూరం బట్టి ధరల వ్యత్యాసాలు ఉంటాయి. అధికారంలో ఎవరుంటే వారి అండదండలు అక్రమ రవాణాదారులకు ఉంటున్నాయి.



ఈ నెల 5న గ్రావెల్ తీసే చోట పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

ఆర్డీవో సీజ్‌చేసిన వాహనం అక్కడే ఉన్నా..

పూలతోటమిట్ట నుంచి గ్రావెల్ రవాణా చేయడంపై స్థానికుల ఫిర్యాదులతో ఈనెల 5వ తేదీన సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అక్కడికి వచ్చారు. అప్పటికే వాహనదారులు టిప్పర్లను తప్పించేశారు. రెండు హిటాచీలను మాత్రం ఆమె సీజ్ చేశారు. ఒకటి పోలీస్ స్టేషన్‌లో.. మరొకటి సంఘటనా స్థలానికి సమీపంలోనే ఉంచారు. ఆ హిటాచీ ఉన్న భూముల్లోనే ఇప్పుడు మళ్లీ గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసీ అధికార యంత్రాంగం కదలకపోవడం విశేషం. దీనిపై తహసీల్దారు శైలకుమారిని వివరణ కోరగా గ్రావెల్ రవాణాపై చర్యలు తీసుకొంటామన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- అర్ధరాత్రి అక్రమ రవాణా
- సమాచారం ఇచ్చినా స్పందించని నిఘా టీం



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ఇన్నాళ్లు జగనన్న లే అవుట్ల నుంచి అక్రమంగా మట్టి రవాణా సాగించిన అక్రమార్కులు ఇప్పుడు ఇలుపూరు చెరువుపై పడ్డారు. బుధవారం రాత్రి 8 గంటల నుంచి చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టిను తవ్వి ట్రాక్టర్ల ద్వారా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న పరిశ్రమలు, లే అవుట్‌లకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల మట్టి అక్రమ రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్ ఆధ్వర్యంలో వీఆర్వో, వీఆర్ఏలతో నిఘా టీంను ఏర్పాటు చేశారు. ఇలుపూరు గ్రామస్తులు చెరువులో మట్టి తవ్వకాలపై తహసీల్దార్ నరసింహరావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన సంబంధిత నిఘా టీంకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడం గమనార్హం. మట్టి అక్రమ రవాణాను కట్టడిచేసేలా అధికారుల చర్యలు లేవన్న విమర్శలున్నాయి.

ఎన్నో ఇబ్బందులున్నా
రూ.25 కోట్లు ఇస్తున్నా

- హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించండి
- పనుల్లో నాణ్యత లేకపోతే జైలుకు పంపిస్తా
- అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఎన్నో ఇబ్బందులు పడి రూ.25 కోట్లు ఇస్తున్నా. మరమ్మతుల పేరుతో ఎవరైనా అవినీతికి పాల్పడితే జైలుకు పంపిస్తా' అంటూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. మీ పరిధిలోని హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులకు శనివారంలోపు అంచనాలు పంపాలని, దీనిపై పదేపదే సమీక్షిస్తున్నా కొంతమందిలో మార్పు రావడంలేదన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన సమీక్షా సమావేశానికి బీసీ సంక్షేమశాఖ నుంచి అధికారులు రాకపోవడంపై ఆగ్రహించారు. కుంటిసాకులు చెబితే ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు. రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుని హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కొన్ని సంక్షేమ శాఖల్లో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఇలాగైతే సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. ఒకరిద్దరు అధికారుల తీరు పట్ల తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్సులో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, ఈఈ బాలసుబ్రహ్మణ్యం, జిల్లా బీసీ, గిరిజన సంక్షేమ అధికారులు చంద్రశేఖర్, సూర్యనారాయణ, గురుకుల పాఠశాలల సమన్వయకర్త రేష్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల
దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం కింద సబ్సిడీతో కూడిన రుణాల కోసం దరఖాస్తు గడువును ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సామాజిక వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(ఇంగ్లిష్ మీడియం) ప్రవేశం కోసం బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని, అర్హులైన వారు వచ్చే నెల 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7995562127ను సంప్రదించాలని కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేయడానికి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా పారిశ్రామిక కేంద్రం జీఎం మారుతి ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించేందుకు అవసరమైన అవగాహన, ప్రాజెక్టు ప్రిపరేషన్, పథకాల వివరాలు, మార్కెట్‌పై అవగాహన కల్పిస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు 7680863089, 9390786466లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నాగలాపురంలో 'లక్కీ భాస్కర్'!

- బ్యాంకులో చేతివాటం
- రూ.రెండు కోట్లకుపైగా నగలు గోల్‌మాల్

సత్యవేడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని ఓ బ్యాంకులో కీలక విభాగంలో పని చేస్తున్న ఉద్యోగి లక్కీ భాస్కర్ సినిమా తరహాలో చేతివాటం చూపాడు. రూ.రెండు కోట్లకు పైగా నగలు గోల్‌మాల్ చేసినట్లు సమాచారం. సదరు బ్యాంకులో తాకట్టుకోసం పెట్టిన నగలను తన సొంతానికి వాడుకున్నట్లు తెలిసింది. ఇటీవల బ్యాంకులో సోషల్ ఆడిట్ జరగడంతో నగలకు సంబంధించిన లావాదేవీలలో తేడాలను గుర్తించారు. దీనిపై అధికారులు విచారణ జరపగా విషయం బయటపడినట్లు తెలిసింది. ఏకంగా రూ.రెండుకోట్లకు పైగా నగలకు సంబంధించిన లావాదేవీలలో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించి, అతడిని విధుల నుంచి తొలగించినట్లు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కనీయకుండా విచారణ సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



కదిరి మోహన ప్రభాకర్‌కు
రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన బీఎస్ఎఫ్ మాజీ అసిస్టెంట్ కమాండెంట్ అధికారి కదిరి మోహనప్రభాకర్ రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకాన్ని అందుకున్నారు.న్యూఢిల్లీలోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కదిరి మోహన ప్రభాకర్‌కు 2023కు గానూ బీఎస్ఎఫ్ డైరక్టర్ జనరల్ దల్జీత్‌సింగ్ రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకాన్ని(ప్రెసిడెంట్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) అందజేశారు. బీఎస్ఎఫ్‌లో 40ఏళ్ల పాటు నిర్విరామ సేవలందించినందుకు 2023వ సంవత్సరంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్రప్రభుత్వం మోహన ప్రభాకర్‌కు ప్రతిభా సేవా పతకాన్ని ప్రకటించింది. మోహనప్రభాకర్ బీఎస్ఎఫ్ విధి నిర్వహణలో భాగంగా జమ్మూలో పని చేశారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌గా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, న్యూఢిల్లీల్లో సేవలందించారు.ప్రాథమిక పాఠశాల విద్యను కార్వేటినగరం ప్రభుత్వ పాఠశాలలో, ఉన్నత విద్యను తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాక మోహనప్రభాకర్ 1984మార్చి 19న బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగారు.2024లో అసిస్టెంట్ కమాండెంట్(మినిస్టీరియల్) హోదాలో రిటైరయ్యాక ఏపీ భవన్‌లో లైజన్ అండ్ ప్రోటోకాల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



మాఘపౌర్ణమి రోజున శేషాచలం కొండల్లోని రామకృష్ణ తీర్థానికి భక్త జనం పోటెత్తారు. తిరుమల ఆలయం నుంచి ఆరుకిలోమీటర్ల దూరం అడవుల్లో ఊరేగింపుగా వెళ్లిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

6లో



ముక్కంటి ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు, వినాయకస్వామి, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వర స్వామి, త్రిశూలాన్ని వేంచేపుగా స్వర్ణముఖి నది వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. మాఘపౌర్ణమి సందర్భంగా త్రిశూల స్నానఘట్టం నిర్వహించారు.

6లో





అలిపిరి మెట్లోత్సవం

అలిపిరి పాదాల మండపం వద్ద బుధవారం తెల్లవారుజామున మెట్లోత్సవం వైభవంగా జరిగింది. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్.ఆనందతీర్థాచార్య మెట్లపూజ నిర్వహించి ఉత్సవం ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మెట్లోత్సవం విశేషాన్ని సభ్యులకు వివరించారు. అనంతరం స్వామి సంకీర్తనలు ఆలపిస్తూ వీరంతా తిరుమల కొండకు నడచి చేరుకున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

కన్నుల పండువగా

మాఘ పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో బుధవారం మాఘమాస పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మాఘ పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుని శ్రీవారి ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి





తిరుమల కొండల్లో..

వేడుకగా రామకృష్ణతీర్థ ముక్కోటి





తిరుమల శేషాచల అడవుల్లోని పుణ్యతీర్థాల్లో ఒకటైన శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి బుధవారం వేడుకగా జరిగింది. ప్రతిఏడాది మాఘ మాసంలో పౌర్ణమినాడు శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి అర్చక సిబ్బంది మంత్రోచ్చారణ చేసుకుంటూ ఊరేగింపుగా బయలుదేరి ఉదయం 11 గంటలకు తీర్థానికి చేరుకున్నారు. అక్కడ కొలువై ఉన్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ భగవానుల విగ్రహాలకు పాలు, పెరుగు, చందనం, తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.ఇక తీర్థానికి వెళ్లే భక్తులకు పాపవినాశనం డ్యాం వద్ద పొంగలి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర పొట్లాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను శ్రీవారిసేవకులు అందజేశారు. అలాగే టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మార్గ మధ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ ఇంజినీరింగ్, ఫారెస్ట్ విభాగాలు సౌకర్యాలను కల్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





స్వామి అమ్మవార్లకు, త్రిశూలానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి క్షేత్రంలో..

ఆగమోక్తంగా త్రిశూల స్నానం





త్రిశూలంతో వేదపండితులు

శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద స్వర్ణముఖి నదిలో బుధవారం ఆగమోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. మహాశివరాత్రికి 15 రోజుల ముందు మాఘపౌర్ణమి వస్తుంది. ఆ రోజున త్రిశూలస్నానం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా రెండు రోజుల ముందు నుంచే స్వర్ణముఖి నదిలో పవిత్రజలాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లు, వినాయక స్వామి, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్ఠింపజేసి స్వర్ణముఖి నది వద్దకు తీసుకొచ్చారు. నది వద్ద స్వామి అమ్మవార్లను ఉంచి సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నానం నిర్వహించారు. అదే సమయంలో భక్తులు కూడా నదిలో మునిగారు. అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, వేదపండితులు, బొజ్జల రిషితారెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

■ నేడు వరల్డ్ రేడియో డే

బుల్లిపెట్టె నేస్తం

- కాలానుగుణ మార్పులను తట్టుకుని.. ఉనికి పదిలపర్చుకుంటున్న రేడియో



రేడియో..ఒకప్పుడు ఇంటిల్లపాదికీ ఆత్మీయనేస్తం.. ప్రభుత్వానికీ ప్రజల మధ్య సమాచార వారధి.. జాతీయ సమైక్యతకు సారథి..కళాకారులకు పెన్నిధి..ఆబాల గోపాలానికి ఆనందాల విందును పంచిన ఈ మాధ్యమం ఇప్పుడు ఉనికి నిలబెట్టుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా బాణీ మార్చుకుంటోంది. తన ప్రియ శ్రోతలను అలరించేందుకు ఆధునికతను అందిపుచ్చుకుంటోంది. వినండి..వినండి.. వింటూనే ఉండండంటూ ఆహ్వానం పలుకుతోంది.

-తిరుపతి, ఆంధ్రజ్యోతి

సుమారు వందేళ్ల చరిత్ర ఉన్న రేడియో 1980 దశకం తర్వాత టీవీల రంగప్రవేశంతో నెమ్మదిగా ప్రజాదరణకు దూరమైంది. అందరికీ బంధువుగా నిలిచిన మాధ్యమం ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదురైంది. అయితే కొన్నేళ్లుగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉనికి పదిలపరుకోడానికి కృషి చేస్తోంది. రేడియో డిజిటల్ విప్లవంగా పరిణామం చెందుతోంది. ఆన్‌లైన్ స్ట్రీమింగ్, పాడ్‌కాస్టులు, ఉపగ్రహ రేడియోల పెరుగుదల రేడియో కంటెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. డిజిటల్ మీడియా పెరుగుతున్నా ఈ బుల్లి మాధ్యమం శక్తివంతమైన కమ్యూనికేషన్ సాధనంగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో, మొబైల్ నెట్‌వర్క్ పనిచేయనప్పుడు రేడియో కీలకమైన సమాచార సాధనంగా ఉపకరిస్తోంది. అత్యవసర సమయాల్లో ప్రభావిత వర్గాలను చేరుకోవడానికి ప్రభుత్వాలు, ఎన్జీవోలు రేడియోపై ఆధారపడుతున్నాయి. కమ్యూనిటీ రేడియో స్టేషన్లు స్థానిక వార్తలను ప్రసారం చేయడం, సామాజిక సమస్యలను చర్చించడం, స్థానిక సంస్కృతి, సంగీతాన్ని ప్లే చేయడంద్వారా లక్షలాది మందికి రేడియో చేరుకుంటోంది. పాడ్‌కాస్టులు, ఆడియోబుక్‌లు, ఆన్‌లైన్ టాక్ షోలు యువతరాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికీ ప్రధాని మోదీ మన్‌కీబాత్ పేరిట దేశ ప్రజలతో అభిప్రాయాలను పంచుకుంటున్నారు. కమ్యూనిటీ రేడియో వ్యవస్థ కూడా ఆదరణ పొందగలుగుతోంది.

తిరుపతిలోని ఆకాశవాణి కేంద్రం



● చిన్నప్పటి నుంచి రేడియో ప్రభావం



ఆరోతరగతి నుంచీ రేడియోకు అలవాటు పడ్డాం. పాటలు వింటూ స్కూల్‌కు రెడీ అయ్యేవాళ్లం. రాత్రి పాటలు వింటూ పడుకునేవాళ్ళం. ఆదివారమైతే రేడియోలో నాటకాలు వచ్చేవి. ఆసక్తిగా వినేవాళ్ళం. ఇప్పుడు కూడా ఉదయం నిద్రలేచింది మొదలు డ్యూటీకి రెడీ అయ్యేవరకు రేడియో ఆన్‌లోనే ఉంటుంది. సాయంత్రం ఇంటికి వచ్చాక మళ్లీ రేడియో ఆన్ చేసి ఆకాశవాణి వార్తలు వినడం అలవాటు.

- డాక్టర్ ఏవై లక్ష్మి, ప్రొఫెసర్, స్విమ్స్ రేడియాలజి విభాగం

● అభిరుచికి అనుగుణంగా మార్పులు



కాలానుగుణంగా అభిరుచి మేరకు కార్యక్రమాలను అందిస్తున్నాం. తిరుపతి ఆకాశవాణి పరిధిలో మంచి శ్రోతలు ఉన్నారు. బయటపడరు. ఉదయం 5.53 గంటలకు సిగ్నేచర్ ట్యూన్‌తో మొదలై 6 గంటలనుంచి ప్రబోధగీతం, వార్తలు, సూక్తిముక్తావళి, పొలం కబుర్లు, ప్రాంతీయ వార్తలు, ఉదయరాగం (సినిమా పాటలు) ఉంటాయి. 7.15 గంటలకు ప్రభాతరేఖల్లో హెల్త్, పొయిట్రీ, షార్ట్ స్టోరీస్, ప్రభుత్వ స్కీమ్స్, ఇంటర్వ్యూ ప్రసారాలు ఉంటాయి. హలో ఆకాశవాణి వాట్సప్ చిత్రం, లిజనర్స్ పాటలు, వనితా లోకం, యువవాణి, బాలానందం,కిసాన్ వాణి వంటి కార్యక్రమాలకు ఆదరణ ఉంది.

- మోహన్ సుధాకర్, ఏడీ, ఆకాశవాణి తిరుపతి

● రేడియో నా నేస్తం

1964నుంచి రేడియో ప్రసారాలు వింటున్నాను. అప్పుడు నా వయస్సు 30 ఏళ్లు. ఇప్పుడు 92 ఏళ్లు వచ్చినా రేడియోను వదలిపెట్టలేదు. అదేనా ఫ్రెండ్. ఉదయం సుప్రభాతంతో మొదలై వార్తలు, నిపుణుల సలహాలు, రాత్రి పడుకునే ముందు లలిత సంగీతం వింటూ పడుకుంటాను. రాష్ట్ర విభజనానంతరం కూడా తిరుపతి రిలే స్టేషన్‌గానే ఉంది. ఇప్పటికైనా మెయిన్ స్టేషన్‌గా మార్చాలి.



- టి.సుబ్బన్న, రైల్వే విశ్రాంత ఉద్యోగి, తిరుపతి

ముగ్గులేసిన మహిళలకు రూ.5.56 లక్షల పంపిణీ

చంద్రగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భోగి పండుగ రోజున సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు రూ.10,116 చొప్పున రూ.5,56,380 బుధవారం పంపిణీ చేశారు. ఏటా నారావారిపల్లెలో ఎ.రంగంపేట నుంచి భీమవరం వరకు గ్రామాల మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలను భువనేశ్వరి నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేస్తారు. గతనెలలో ముగ్గుల పోటీల్లో 55మంది ముగ్గులు వేశారు. ఆమె ఆదేశాల మేరకు బుధవారం టీటీడీ కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రూ.10,116 వంతున వారందరికీ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోదండరామానాయుడు, వైకుంఠం శ్రీధర్‌నాయుడు, సర్పంచ్ భర్త గిరినాయుడు, నిరంజన్‌నాయుడు, శేఖర్‌నాయుడు, కుమార్, వల్లూరి శ్రీకాంత్‌చౌదరి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొని.. నగదు బహుమతి అందుకున్న మహిళలు

టీటీడీ ఏడీ భవనం ఎదుట సాధువుల నిరశన దీక్ష



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి జూపార్కు రోడ్డులో నిర్మాణం చేపడుతున్న ఒబెరాయ్ హోటల్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని బుధవారం కొందరు సాధువులు టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరశన దీక్షకు దిగారు. టీటీడీ పాలకమండలిలో ఒబెరాయ్ హోటల్ రద్దు చేస్తున్నట్లు తీర్మానించారని, అయినా అక్కడ పనులు చురుగ్గా జరుగుతున్నాయని శ్రీనివాసానందసరస్వతి తెలిపారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తిరుమల ప్రవిత్రతను నాశనం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వారాహి డిక్లరేషన్, సనాతన ధర్మరక్షణ బోర్డును తీసుకొస్తామని తిరుమల క్షేత్రంలో చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఈ విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. జనసేన హస్తం ఉందికాబట్టే హోటల్ నిర్మాణం యథేచ్ఛగా సాగుతోందన్నారు. దీనిని రద్దు చేసేంతవరకు అమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు.

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- రూ.25 లక్షల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు నగలను చూపుతున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలు, తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే ముగ్గురు దొంగలను తిరుపతి, తిరుచానూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 లక్షల విలువ చేసే 277 గ్రాముల బంగారు నగలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మెహిదీపట్నంకు చెందిన సుధాకర్ అలియాస్ ఆంథోని, రంగారెడ్డి జిల్లాకు చెందిన పిల్లిశేఖర్, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన గాజులపల్లి శ్రీనివాసులురెడ్డి మంచి స్నేహితులు. వీరిలో సుధాకర్‌పై 100కుపైగా, పిల్లి శేఖర్ పైన 160కిపైగా దొంగతనం కేసులున్నాయి. ఈ ముగ్గురు కలిసి ఇటీవల తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లె పంచాయతీ తిరుమల నగర్‌లోని రవి ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, నగదు అపహరించుకొని వెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకునేందుకు తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్ కుమార్, ఎస్‌ఐలు అరుణ, జగన్నాథరెడ్డి, సాయినాథ్ చౌదరి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు బుధవారం తిరుపతి ఆర్టీవో కార్యాలయం వద్ద తిరుగుతున్న సుధాకర్, పిల్లి శేఖర్,గాజులపల్లి శ్రీనివాసులురెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి నుంచి రూ.25 లక్షల విలువ చేసే 277 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుచానూరు సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందిని అభినందించారు.

ఆహ్లాదం కోసమే నగర వనం: కురుగొండ్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు ఆహ్లాదక వాతావరణాన్ని అందించేందుకే నగర వనం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక తిరుపతిలో రోడ్డులో అటవీశాఖ ఆధ్వర్యంలో నగర వనం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి పట్టణ ప్రజలకు ఆహ్లాదక వాతావరణాన్ని అందించేందుకే 74 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఇందులో వాకింగ్ ట్రాక్, రన్నింగ్ ట్రాక్ కూడా నిర్మిస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అటవీశాఖ ఇలాంటివి కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సీఎఫ్ సెల్వం, డీఎఫ్‌వో వివేకర్, రేంజర్ లోకేష్, డీఆర్‌వో ప్రతాప్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాంబాబు, ఎంపీడీవో కోటేశ్వరరావు, ఎంపీపీ తనూజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చే వరకు భూములివ్వం



రోడ్డు పనులను అడ్డుకున్న రైతులతో చర్చిస్తున్న అధికారులు

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు విస్తరణకు భూములిచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటికీ ఒక్క పైసా ఇవ్వలేదని, పరిహారం ఇచ్చే వరకు భూముల్లోకి దిగనివ్వబోమంటూ రైతులు రోడ్డు పనులు అడ్డుకొని వాహనాలను నిలిపివేశారు. ఈ ఘటన బుధవారం కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెంలో జరిగింది. రైతుల కథనం మేరకు వివరాలు... సాగరమాల రోడ్డు విస్తరణ కోసం నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాథపురం అగ్రహారం గ్రామాలకు చెందిన రైతుల భూములు తీసుకున్నారు. అయితే చిన్నచిన్న లోపాల కారణంగా పరిహారం ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పనులను అడ్డుకున్న విషయం తెలుసుకున్న తహసీల్దారు జయజయరావు హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకొని ఆందోళన చేస్తున్న రైతులకు సర్దిచెప్పారు. కలెక్టర్, సబ్ కలెక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు.

మోడల్ పాఠశాల ఎంపికలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శైలజ

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరానికి మోడల్ పాఠశాల ఎంపికకు శ్రీకారం చుట్టిందని, ఇందులో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని ఎంఈవోలు శైలజ, మస్తానయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మోడల్ పాఠశాలల ఎంపికపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధునాతన వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం పాఠశాలల ఎంపిక, అభివృద్ధిలో తల్లిదండ్రుల సహకారాన్ని తీసుకోవాలన్నారు.

వెంకయ్యస్వామి ఆలయ ముఖద్వారానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్టలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయ ముఖద్వార నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు భూమిపూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు వెంకయ్యస్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖద్వార నిర్మాణ భూమిపూజలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖద్వార నిర్మాణానికి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ రూ.10 వేల చొప్పున విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, మేడా సాయినారాయణ, కుదిరి పెంచలయ్య, కొమరంజేరి శ్రీధర్, కొండల్‌రావు, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుజిత

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మానసిక వ్యాధులపై అవగాహన కల్పించారు. నెల్లూరుకు చెందిన డాక్టర్ సుజిత ఆధ్వర్యంలో మానసిక ఒత్తిళ్లు, వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒత్తిడిని జయిస్తే ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ ఉదయకుమార్, డాక్టర్ హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న బర్డ్‌ఫ్లూ

తగ్గిన చికెన్, గుడ్ల విక్రయాలు

గూడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్, కోడి గుడ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. వారం రోజులుగా పలు రాష్ట్రాలతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో కూడా బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందుతున్నట్లు ప్రచారం జరగడంతో చికెన్ ధరలు పడిపోయాయి. గూడూరు సమీప ప్రాంతాల్లో కోళ్ల ఫారాలు లేకపోయినా ప్రతిరోజూ చిత్తూరు జిల్లా నుంచి మాంస దుకాణాలకు కోళ్లు సరఫరా అవుతుంటాయి. గూడూరు పట్టణంలో సుమారు 20కు పైగా మాంస దుకాణాల్లో రోజుకు 3వేల కిలోల కోడి మాంస విక్రయాలు జరుగుతుంటాయి. వారం రోజులుగా బర్డ్‌ఫ్లూ వైరస్ సోకడంతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయని ప్రచారం జరుగుతుండంతో చికెన్ తినేందుకు ప్రజలు భయపడుతున్నారు. ధరలు తగ్గకుండా నిలకడ గానే ఉన్నా విక్రయాలు మాత్రం పడిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.

భూముల పరిశీలన

వాకాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న సర్వే నెంబరు 95111లోని పది ఎకరాల భూములను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా బుధవారం పరిశీలించారు. తహసీల్దారు రామయ్య, మండల సర్వేయర్ శకుంతలతో మాటాడి భూముల వివరాలను తెలుసుకున్నారు. ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ అఖిల్‌యాదవ్, సర్వేయరు శ్రీలత, వీఆర్వో కాటమ్మ ఉన్నారు.

ఏ బస్సు ఎప్పుడు.. ఎక్కడికెళ్తుందో!

- రాత్రికి రాత్రే మారిపోతున్న బస్సుల వేళలు
- తరచూ సర్వీసుల రద్దుతో ప్రయాణికులు, సిబ్బంది తికమక
- సూళ్లూరుపేట డిపోలో గాడితప్పిన పాలన



సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో పాలన గాడితప్పింది. కొంతమంది సిబ్బందే అధికారుల అవతారం ఎత్తి రాత్రికి రాత్రే బస్సుల వేళలను ఇష్టానుసారంగా మారేస్తున్నారు. ఆర్డినరీ బస్సులు ఎక్స్‌ప్రెస్‌లుగా, ఎక్స్‌ప్రెస్‌లు ఆర్డినరీగా తిరగాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ సర్వీసు ఎక్కడికి పోతుందో తెలియక సిబ్బందితో పాటు ప్రయాణికులు తికమక పడుతున్నారు.

రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సూళ్లూరుపేటలో 1998లో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్టీసీ డిపోను ప్రారంభించారు. తొలినాళ్లలోనే ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభించడంతో డిపో లాభాల బాటలో నడిచింది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారు. అధికారులు, సిబ్బంది వైసీపీ నాయకులతో అంటకాగి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. టీడీపీకి అనుకూలమైన గ్రామాలుగా పేరొందిన వాటంబేడు, ఎన్ఎంకండ్రిగ, జీలపాటూరు, ఉచ్చూరు, వేణుంబాక, రోసనూరు సర్వీసులను పూర్తిగా ఎత్తివేశారు. అప్పట్లో డిపోలో 60 సర్వీసులుండగా ప్రస్తుతం కేవలం 28సర్వీసులే నడుస్తున్నాయి. గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాలకు బస్సులు లేకుండా పోయాయి. జిల్లా కేంద్రమైన తిరుపతికి పూర్తిగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులే నడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల బస్సులు నడపాలని ప్రజలు పలుమార్లు డిపో అధికారులకు విన్నవించుకొన్న పట్టించుకోలేదు. దీంతో ప్రైవేట్ వాహనాలు, ఆటోలే దిక్కయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్టీసీ డిపో బాగుపడుతుందని అందరూ భావించారు. అయితే ఇప్పుడు కూడా వైసీపీకి అంటకాగిన అధికారులు, సిబ్బంది వ్యవహార శైలి మారలేదు. తాజాగా తడ - నెల్లూరు మధ్య తిరుగుతున్న అల్ట్రా పల్లె వెలుగు బస్సులను ముందస్తు సమాచారం ఇవ్వకుండానే రద్దు చేశారు. అదే షెడ్యూల్‌తో ఆ సర్వీసులను వివిధ ప్రాంతాలకు నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నారు. కోట, తిరుపతి, నెల్లూరు మార్గాల్లో తరచూ బస్సులను రద్దు చేస్తున్నారు. ప్రయాణికులు అడిగినా సరైన సమాధానం లేదు. ఇదిలా ఉండగా డిపోలో ఉన్నతాధికారుల అనుమతి పలువురు కండక్టర్లు, డ్రైవర్లు వారి విధులకు డుమ్మాకొట్టి సూపర్‌వైజర్లు, అధికారులుగా చెలామణి అవుతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. ఇక డిపోలో లోపాలను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాల్సిన విజిలెన్స్ నిద్రపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో పూర్వ వైభవానికి చర్యలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో కిషోర్

గూడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చునని రవాణాశాఖ అధికారి కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక పోటుపాళెలోని ఆర్టీవో కార్యాలయం వద్ద జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలను నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు జకీర్‌అహ్మద్, సునీల్, ఏఎంవీఐ శాంతి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ముగిసి నెలరోజులు కావస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారంపై నివేదికలు స్పష్టంగా రాలేదని, ఇలాగే వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన హెచ్చరించారు కోట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీల పరిష్కారంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలతో సమీక్ష జరిగింది. మండలంలోని 21 పంచాయతీల వారీగా వచ్చిన అర్జీలు, పరిష్కరించిన వాటి వివరాల గురించి సబ్ కలెక్టర్ ప్రశ్నించారు. కొన్ని పంచాయతీల్లో తక్కువ అర్జీలు వచ్చినప్పటికీ, పరిష్కరించిన వాటి సంఖ్య ఎక్కువగా చెప్పడంతో సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలనుంచి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దారు జయజయరావు, డిప్యూటీ తహసీల్దారు అజ్మతుల్లా ఖాన్, ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈ - కార్యాలయంతో పారదర్శకత



ఈ-కార్యాలయ నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ - కార్యాలయంతో పారదర్శకత రికార్డులను పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించవచ్చని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూళ్లూరుపేట డివిజన్ స్థాయి రెవెన్యూ సిబ్బందికి ఈ- కార్యాలయ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ - కార్యాలయ నిర్వహణ ద్వారా సిబ్బందితో పాటు ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


చెత్త నుంచి సంపద సృష్టించాలి



తాళ్వాయిపాడులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో రవీంద్రబాబు

పెళ్లకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్పీవో రవీంద్రబాబు అన్నారు. బుధవారం మండలంలోని తాళ్వాయిపాడు, శిరసనంబేడు గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ మండలంలో ఉన్న 20 చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామాల్లో సేకరించిన తడి, పొడిచెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ మంత్రిని కలిసిన వేనాటి



మంత్రి బీసీ జనార్దనరెడ్డితో వేనాటి సతీష్ రెడ్డి, కందల కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయుడుపేట పట్టణ, రూరల్ అధ్యక్షులు కందల కృష్ణారెడ్డి, కామిరెడ్డి అశోక్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితి మంత్రికి వివరించారు. రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు టీడీపీ చెప్పారు.

కార్పొరేషన్ రుణాలకు 422 దరఖాస్తులు

వాకాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు పొందేందుకు వాకాడు మండలంలో 422 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. మండలానికి మొత్తం 34 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు.

తడ: కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు పొందేందుకు తడ మండలంలో 63 యూనిట్లకు 159 దరఖాస్తు అందాయని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఆయన చెప్పారు.

గ్యాంగ్‌మెన్‌కు భద్రత కల్పించాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ట్రాక్, గ్యాంగ్‌మెన్‌కు భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న సెక్షన్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద ఆ విభాగానికి చెందిన ఉద్యోగులు నిరసన తెలిపారు. మంగళవారం తడ మండలం అనపగుంట వద్ద విధి గ్యాంగ్‌మెన్‌లు నిర్వహణలో ఉండగా రైలు ఢీకొని ఒకరి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని గ్యాంగ్‌మెన్‌లు ఆరోపించారు. గ్యాంగ్‌మెన్‌లు ట్రాక్‌పై పనిచేసే సమయంలో రైళ్ల రాకపోకల సమాచారం ఇస్తూ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగ భద్రత లేకపోతే తాము విధులకు హాజరుకాబోమని చెప్పారు.

పాఠశాలలో డైనింగ్ హాల్‌కు భూమిపూజ



డైనింగ్‌హాల్‌కు భూమిపూజ చేస్తున్న రాజగోపాల్, కృష్ణారావు

నాయుడుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ ఏర్పాటుకు బుధవారం రోటరీక్లబ్ అధ్యక్షుడు జె.రాజగోపాల్, మునగాల కృష్ణారావు భూమిపూజ చేశారు. డైనింగ్ హాల్ ఏర్పాటుకు అమెరికాలోని బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజింగ్ క్లబ్ సభ్యులు సహకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాదలూరు సంజాయ్, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, ఉదయ శంకర్, నాగూరయ్య, బట్టా సుబ్రహ్మణ్యం, చెంచయ్య పాల్గొన్నారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి జయశ్రీదేవి

తడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడులో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం వైద్యాధికారి జయశ్రీదేవి తనిఖీ చేశారు. మందులతో పాటు రోగుల వివరాల రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సేవలతో పాటు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, వారిలో అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజకుమారి, సిబ్బంది సరస్సు, శివరంజని పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రక్తదానం



రక్తదాతలను అభినందిస్తున్న వైద్యాధికారిణి రూప

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోట ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఆర్టీసీ కార్మికులు రక్తదానం చేశారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని వాకాడు ఆర్టీసీ డీఎం పెంచలయ్య ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదాతలను డాక్టర్ రూప, డాఎం పెంచలయ్య అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, కంట్రోలర్ జార్జి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామాపురం పంచాయతీలో రూ.10 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఎంపీడీవో విజయ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ దిలీప్, సర్పంచు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 15,16 తేదీల్లో నూతనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. 500 సంవత్సరాలకు ముందు నిర్మించిన ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహాయంతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ హరి, అర్చకులు సోమశేఖరశర్మ, వీఆర్వో బాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్ధికి ఈకేవైసీ తప్పనిసరి

పెళ్లకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ లబ్ధి పొందడానికి ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ అన్నారు. బుధవారం మండలంలోని పునబాక, తాళ్వాయిపాడు రైతు సేవా కేంద్రాల్లో ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతూ ఈకేవైసీ, ఎన్పీసీఐ లింకు చేసుకోని రైతు సేవా కేంద్రాలు, సీఎస్సీ సెంటర్‌లకు వెళ్లి ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ దినేష్ తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సొంత పొలం కలిగిన రైతులందరూ రిజిస్ట్రీ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏవో రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని వెందోడు, పాలిచెర్ల గ్రామాల్లోని రైతేసేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు త్వరతగతిన రైతులకు అందుతాయన్నారు. కార్యక్రమంలో శివ, చక్రి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో మాఘ పౌర్ణమి వేడుకలు



కలశ స్థాపన చేస్తున్న వేదపండితులు, సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో బుధవారం మాఘమాస పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయం ఎదుట 108 కలశస్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలను భక్తులు ఆలయం చుట్టూ ప్రదర్శనగా తీసుకొచ్చి అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేద పండితులు, మంత్రోచ్ఛరణల నడుమ మహా చండీయాగాన్ని వైభవంగా నిర్వహించారు. రామ్‌కుమార్ రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

వాకాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించి టైమ్‌స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవ, ఇంద్రప్రసన్న, కస్తూరయ్య, రాజ్‌కుమారి, ధావిదు, సుబ్బయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నాయుడుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ భవన్‌లో బుధవారం మెప్మా, పారిశుధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి పొడి, తడి చెత్త వేర్వేరుగా అందజేసేలా అవగాహన కల్పించాలని కమిషనర్ అన్నారు.